UDYAM-TS-02-0308842

www.prathighatana.com

# ప్రతిఘటన

తెలుగు దిన పత్రిక

జనం కోసం..

Vanga Nagaraju

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 21 | పేజీలు : 8 | ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | వెల : 4/-

## అమెరికా ఒప్పందంపై ప్రధాని, మంత్రులు భ్రమలు కల్పిస్తున్నారు

- భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై మరోసారి రాహుల్ విమర్శలు
- వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపణ
- ప్రధాని, ఆయన మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని విమర్శ
- ఎక్స్‌లో వీడియో విడుదల చేసిన రాహుల్

# టార్గెట్ 90

- 90 మున్సిపాలిటీల్లో పాగా వేయడంపై దృష్టిపెట్టాలన్న సీఎం
- పార్లమెంటు ఇన్‌చార్జి మంత్రులకే బాధ్యత అప్పగించిన రేవంత్
- స్వతంత్రులు, కలిసి వచ్చే పార్టీల సహకారం తీసుకోవాలని దిశానిర్దేశం
- మంత్రులు, పార్టీ నేతలతో ప్రత్యేక భేటీ.. మున్సిపల్ ఫలితాలపై సంతృప్తి
- అందరం కలసికట్టుగా పనిచేయడం వల్లే సత్ఫలితాలు సాధించాం
- పార్టీ విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలకు అభినందనలు



హైదరాబాద్

రాష్ట్రంలో ఈ నెల 16న జరిగే మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ఎన్నికల్లో కనీసం 90కి తగ్గకుండా పురపాలి కల్లో కాంగ్రెస్ కొలువు తీరాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులకు లక్ష్యం నిర్దేశించారు. ఎన్నికల ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే భవిష్యత్తు కార్యాచరణపై వారికి దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళి, హంగ్ మున్సిపాలిటీల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ సభ్యులతో శనివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో ప్రత్యే కంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ - మిగతా2లో



## అగ్నిపరీక్షలా హంగ్

- 36 హంగ్ మున్సిపాలిటీల్లో ప్రధాన పార్టీలకు అగ్నిపరీక్షలా పాలకమండళ్ల ఏర్పాటు
- రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి అధికారం పంచుకుంటేనే అందలమెక్కే పరిస్థితి
- 15 చోట్ల కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ లేదా స్వతంత్రుల సహకారం అవసరం
- బీఆర్ఎస్, బీజేపీ కలిస్తే 15 చోట్ల కాంగ్రెస్‌కు చెక్ పెట్టేలా ఫలితాలు
- వాటిలో పదింట బీఆర్ఎస్, ఐదింట బీజేపీకి ఎక్కువ స్థానాలు..
- పదవుల పంపకాల్లో 3 పార్టీల వ్యూహాలపై ఆసక్తి
- అధికారికంగా అవగాహన కుదరకుంటే 'గోడ దూకుళ్లే' పరిష్కారం!
- ఇప్పటికే జోరుగా సాగుతున్న బేరసారాలు
- మరో ఐదు చోట్ల ఇతర పార్టీలు, ఎక్స్ అఫీషియోలతో పాగాకు



## ఈఎల్ఎఫ్‌పై ల్యాండైన మోదీ

- లాంఛనంగా జాతికి అంకితం
- ఈశాన్యంలో తొలి హైవేరన్‌వే
- గర్వించదగ్గ క్షణాలివి:

5



## శాంతిభద్రతలను పరిరక్షిస్తా

- బీఎన్‌పీ చైర్మన్ తారిఖ్ రెహ్మాన్
- భారత్‌తో సత్సంబంధాల పునరుద్ధరణకు కృషి !
- ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించే ఛాన్స్



## ఈశాన్యంలో చొరబాట్లు... కాంగ్రెస్ పుణ్యమే!



## మేడిగడ్డ పునరుద్ధరణ ఖర్చు మీదే!

- మీ నిర్లక్ష్యంతోనే బరాజ్ కుంగిపోయింది
- పరస్పర అంగీకారంతో మరమ్మతుల ప్రశ్నే ఉత్పన్నం కాదు
- సహకరించకపోతే కఠిన చర్యలు తప్పవు
- 'ఎల్ అండ్ టీ'కి మరోసారి రాష్ట్ర ప్రభుత్వం అల్టిమేటం

## 'మున్సిపోల్స్'లో కాంగ్రెస్‌కు 40% ఓట్లు

- 15 లక్షల ఓట్లతో అగ్రస్థానంలో నిలిచిన అధికార పార్టీ
- బీఆర్ఎస్‌కు 29 శాతం ఓట్లు
- గతంలో ఉన్న 15 శాతం ఓట్లు నిలబెట్టుకున్న బీజేపీ
- పార్టీ ల వారీ ఓట్లను వెల్లడించిన ఈసీ
- మరో ప్రతిపక్షమైన బీజేపీ ఓటు బ్యాంకు గత ఎన్నికలతో పోలిస్తే తగ్గలేదు




హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీ కి ఎన్ని ఓట్లు వచ్చాయనే లెక్క తేలిపోయింది. ఈనెల 11న జరిగిన పోలింగ్‌లో ఏ పార్టీ కి ఎన్ని ఓట్లు, ఎంత శాతం ఓట్లు వచ్చాయన్న వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటించింది. దీని ప్రకారం.. ఈ ఎన్నికల్లో మొత్తం 37,81,232 ఓట్లు పోల్ కాగా, అందులో అత్యధికంగా కాంగ్రెస్‌కు పోలయ్యాయి. ఈ పార్టీకి మొత్తం 39.8 (దాదాపు 40 శాతం)తో 15,05,006 ఓట్లు వచ్చాయి. గత (2020) మున్సిపల్ ఎన్నికలతో పోలిస్తే 7లక్షల ఓట్లు ఆ పార్టీ కి పెరగడం గమనార్హం. బీఆర్ఎస్‌కు గత ఎన్నికలతో పోలిస్తే 5 లక్షల ఓట్లు తగ్గాయి. గత ఎన్నికల్లో 15.90 లక్షల ఓట్లు గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 10,87,347 (దాదాపు 29 శాతం) ఓట్లకు పరిమితమైంది. ఈసారి ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ల మధ్య ఓట్ల వ్యత్యాసం దాదాపు 11 శాతంగా నమోదైంది. బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌కు 4,17,659 ఓట్లు అదనంగా వచ్చాయి. మరో ప్రతిపక్షమైన బీజేపీ ఓటు బ్యాంకు గత ఎన్నికలతో పోలిస్తే - మిగతా2లో

## పట్టణాలకు మహర్దశ

- లక్ష కోట్లతో అర్బన్ చాలెంజ్ ఫండ్
- కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర పట్టణ ప్రగతికి భారీ ఊతం
- ప్రాజెక్టు వ్యయంలో 25% కేంద్ర సాయం
- కనీసం 50% మార్కెట్ సమీకరణలు
- చిన్న పట్టణాలకు రూ.5,000 కోట్ల నిధి
- నగరాల విస్తరణ, ఆర్థిక కారిడార్లు, రవాణా వ్యవస్థ మెరుగుదల

5



ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
ఆదివారం 15 ఫిబ్రవరి 2026

# అగ్నిపరీక్షలా హంగ్

హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల విలక్షణ తీర్పు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలను సంకటంలో పడేసింది. 36 మున్సిపాలిటీల్లో హంగ్ ఫలితాలు రావడంతో పాలకమండళ్లను ఏర్పాటు చేసే అంశం ఆయా పార్టీల మధ్య మూడు ముక్కలాటగా మారింది. పరస్పరం కత్తులు దూసుకొనే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు సహకరించుకుంటేనే కనీసం 15 మున్సిపాలిటీల్లో పాలకమండళ్లు కొలువుతీరే పరిస్థితి నెలకొనడం పార్టీలకు అగ్నిపరీక్షగా మారింది. ఒకవేళ ప్రధాన రాజకీయ పక్షాలు సహకరించుకోకుంటే 'గోడ దూకుళ్లు' మాత్రమే ఆయా మున్సిపాలిటీల్లో పీటముడి వీడేందుకు ఏకైక ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. మరో 12 మున్సిపాలిటీల్లో స్వతంత్రుల సాయంతో, ఇంకో 5 మున్సిపాలిటీల్లో స్వతంత్రులతోపాటు ఎంఐఎం, 'లెఫ్ట్'పార్టీల సాయంతో పాగా వేసేందుకు అధికార పార్టీకి అవకాశం ఉండటంతో ఆ దిశగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది.

**ముడిపడిన మున్సిపాలిటీలివే..**

హంగ్ ఫలితాలు వచ్చిన మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పాగా వేయాలంటే 15 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ మద్దతు తప్పనిసరి కానుంది. ఈ జాబితాలో మెట్‌పల్లి, రాయికల్, అలంపూర్, కామారెడ్డి, జమ్మికుంట, కాగజ్‌నగర్, మెదక్, నర్సాపూర్, ఎల్లంపేట, ఖానాపూర్, ఇంద్రేశం, జిన్నారం, అమరచింత, వర్ధన్నపేట, కేతనపల్లి ఉన్నాయి. కేతనపల్లిలో ఇరు పార్టీలు చైర్మన్, వైస్‌చైర్మన్ల పంపకాలపై అవగాహనకు వచ్చేందుకు అవకాశాలు ఉండగా మెట్‌పల్లి, రాయికల్, కామారెడ్డి, జమ్మికుంట, కాగజ్‌నగర్, మెదక్, నర్సాపేర్, ఎల్లంపేట, నారాయణపేట, ఖానాపూర్, ఇంద్రేశం, జిన్నారం, అమరచింత మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌తో బీజేపీ కలిస్తే సులువుగా చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు చేజిక్కించుకొనే అవకాశం ఉంది. మెట్‌పల్లి, రాయికల్, కామారెడ్డి, నారాయణపేట, ఆదిలాబాద్‌లలో బీజేపీకి ఎక్కువ స్థానాలు రాగా మిగిలిన చోట్ల బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు ఎక్కువ కౌన్సిలర్ స్థానాలు వచ్చాయి. కానీ రాజకీయంగా ఏ రెండు పార్టీలు కలిసినా మూడో పార్టీకి లబ్ధి కలుగుతుందనే అంచనాతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వెనుకంజ వేస్తున్నాయి.

**గైర్హాజరు... గోడ దూకుళ్లు**

ప్రధాన పార్టీలు మూడు దిక్కులుగా ఉన్న పరిస్థితుల్లో మిగిలిన ప్రత్యామ్నాయాలపైనా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికారికంగా అవగాహన కుదుర్చుకోకపోయినా స్థానిక నేతల మధ్య జరిగే చర్చలను బట్టి ఒక పార్టీ గెలుపు కోసం మరో పార్టీ గైర్హాజరైతే ఎలా ఉంటుందనే కోణంలోనూ చర్చలు జరుగుతాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అలా గైర్హాజరు కావడం ద్వారా మేజిక్ ఫిగర్‌లో మార్పులు వస్తే ఇబ్బందులు వస్తాయని.. నేరుగా మద్దతివ్వడమే పరిష్కారమని అంటున్నాయి. ఈ రెండు మార్గాలు కుదరని పక్షంలో మరో పార్టీకి చెందిన కౌన్సిలర్లను లాక్కోవడమే మార్గంగా కనిపిస్తోంది. ఒకవేళ అలా జరిగితే అధికార పార్టీకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటికే పలు చోట్ల స్వతంత్రులు కాంగ్రెస్‌లో చేరడమో లేదా మద్దతు ప్రకటించడమో జరిగిపోయింది. అయితే ఇందుకోసం రూ. లక్షల నుంచి రూ. కోట్ల వరకు బేరసారాలు జరుగుతున్నట్లు సమాచారం.

**స్వతంత్రుల సాయం తీసుకుంటే..**

రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కేవలం స్వతంత్రుల మద్దతుతో కాంగ్రెస్ 12 మున్సిపాలిటీలను గెలిచే అవకాశం ఉందని ఫలితాలు చెబుతున్నాయి. జనగామ, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మొయినాబాద్, ఇస్నాపూర్, కోహిర్, పరిగి, పోచంపల్లి, జగిత్యాల, వేములవాడ, దేవరకద్ర, వికారాబాద్ మున్సిపాలిటీల్లో స్వతంత్రులుగా గెలిచిన వారు కాంగ్రెస్ వైపు వస్తే ఆ స్థానాలు అధికార పార్టీ వశం అవుతాయి. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. మరోవైపు ఒక్క ఎక్స్ అఫీషియో ఓటుతో కేసముద్రం మున్సిపాలిటీని కూడా గెలుచుకోవచ్చు.

దీంతో అధికార పార్టీ ఖాతాలో ఈ 13 మున్సిపాలిటీలు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటితోపాటు గద్వాల, మహబూబాబాద్, నారాయణపేట, జహీరాబాద్, బోధన్‌లలో స్వతంత్రులతోపాటు లెఫ్ట్, ఎంఐఎంలు సహకరిస్తే ఆయా పీఠాలు కూడా అధికార పార్టీకి లభిస్తాయి. ఇక ఆలియాబాద్‌లో మ్యాజిక్ ఫిగర్‌కు మూడు స్థానాలు తక్కువ పడగా ఒక స్వతంత్ర, ఒక బీఎస్పీ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ తన వైపునకు తిప్పుకుంది. ఈ నేపథ్యంలో మరొకరు అవసరం కాగా బీజేపీకి చెందిన ఓ కౌన్సిలర్‌కు వైస్‌చైర్మన్ పదవిని ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. ఈ మున్సిపాలిటీ కూడా కాంగ్రెస్ ఖాతాలోనే చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కూడా ఇక్కడ పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.

**సీఎం వద్దకు వడ్డేపల్లి కౌన్సిలర్లు**

వడ్డేపల్లి మున్సిపాలిటీలో సంచలన విజయం సాధించిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ)కు చెందిన 8 మంది కౌన్సిలర్లు శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. దీంతో వడ్డేపల్లి మున్సిపాలిటీ అధికార కాంగ్రెస్ పార్టీ ఖాతాలో చేరినట్టయింది. స్థానిక నేత వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో సీఎంను కలిసిన వారిలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయభాస్కర్, జయశ్రీ, ఎరుకల తిమ్మప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళికా కమిషన్ వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి ఎస్. సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో పవర్‌గేమ్!

హైదరాబాద్



నగరపాలికల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. కాంగ్రెస్, భాజపాలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. తమ తరఫున గెలిచిన అభ్యర్థులను, తమకు మద్దతిచ్చే స్వతంత్రులను క్యాంపులకు తరలించడంతో పాటు అవసరమైన చోట ఇతర పార్టీల వారిని కూడా తమ వైపు తిప్పుకొనేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించాయి. నిజామాబాద్‌లో తొలుత భాజపాకు అనుకూలంగా ఉందని భావించినా.. కాంగ్రెస్, ఎంఐఎంలకు కలిపి మెజార్టీ మార్కు 30 దాటి 31కి చేరడంతో కాంగ్రెస్‌కే పీఠం దక్కే పరిస్థితి ఏర్పడింది. కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలని సీపీఐతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి చర్చలు జరిపారు. ఎంఐఎం, స్వతంత్రుల మద్దతులో మహబూబ్‌నగర్ కూడా 'హస్త'గతమయ్యే అవకాశముంది. కరీంనగర్‌లో మాత్రం అతిపెద్ద పార్టీగా భాజపా ఎక్కువ స్థానాలు గెలిచినప్పటికీ.. ఓ స్వతంత్ర అభ్యర్థి తెరపైకి రావడంతో మేయర్ ఎవరవుతారనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

**ఎక్స్ అఫీషియో స్పష్టతతో అంచనాలు తారుమారయ్యే పరిస్థితి**

ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటింగ్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వడంతో కొన్నిచోట్ల పార్టీల అంచనాలు తారుమారయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదు కాని ఎంపీ (లోక్‌సభ), ఎమ్మెల్యేలు ఎవరైనా ఉంటే వారు తమ నియోజకవర్గ పరిధిలోని ఏదో ఒక పురపాలక సంఘంలో నమోదు చేసుకోవచ్చు. రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్సీ మాత్రం తమ ఓటు ఎక్కడ ఉందో ఆ పురపాలక సంఘాన్ని మాత్రమే ఎంచుకోవాలి. ఉదాహరణకు ఇద్దరు భాజపా ఎమ్మెల్సీల పరిధి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలైనా..

వీరు ఎక్కడైతే తమ ఓటు నమోదు చేసుకుని ఉంటారో ఆ నగరపాలక సంస్థ లేదా మున్సిపాలిటీలో మాత్రమే ఎక్స్ అఫీషియోగా నమోదుకు అవకాశం ఉంటుంది. వీరి ఓటు నిజామాబాద్, కరీంనగర్ నగరపాలక సంస్థల్లో లేకుంటే అక్కడ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉండటానికి వీలుండదు.

**నిజామాబాద్‌లో వారికి అవకాశం లేదు**

ఏడు నగరపాలక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో రామగుండం, మంచిర్యాల, నల్గొండలలో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం రాగా, మహబూబ్‌నగర్‌లో రెండు ఓట్లు తక్కువ వచ్చినా.. స్వతంత్రులు, ఎంఐఎం మద్దతుతో పీఠం కాంగ్రెస్‌కే దక్కనుంది. మిగిలిన మూడింటిలో నిజామాబాద్ విషయంలో శనివారానికి కాంగ్రెస్‌కు అవకాశాలు మెరుగుపడ్డాయి. 60 మంది సభ్యులున్న నిజామాబాద్ కార్పొరేషన్‌లో 28 భాజపాకు, 17 కాంగ్రెస్‌కు, 14 ఎంఐఎంకు, ఒకటి భారాసకు దక్కాయి. కాంగ్రెస్, ఎంఐఎం కలిపి మెజార్టీ మార్కు దాటడంతో వీరిద్దరూ కలిసి మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు చేజిక్కించుకుంటారని ఒకవైపు, ఎక్స్ అఫీషియో సభ్యులతో భాజపాకు పీఠాన్ని సాధిస్తుందని మరోవైపు ప్రచారం జరిగింది. భాజపాకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా, ఆర్మూరు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమరయ్యలు ఇక్కడే ఓటరుగా నమోదు చేసుకుంటారని ప్రచారం జరిగింది. కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు ఉన్నారు. దీంతో భాజపాకు 33, కాంగ్రెస్, ఎంఐఎంలకు కలిపి 33 ఓట్లు ఉంటాయని, భారాస కార్పొరేటర్‌తో మేయర్ పీఠాన్ని దక్కించుకోవచ్చని ఇరు పార్టీలు భావించాయి. కానీ భాజపా ఎమ్మెల్సీలకు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నిజామాబాద్‌లో అవకాశం లేదని తేలిపోయింది. భారాస కార్పొరేటర్ శుక్రవారం రాత్రే కాంగ్రెస్ శిబిరంలో చేరినట్లు తెలిసింది. దీంతో నిజామాబాద్ మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలు కాంగ్రెస్, ఎంఐఎంలకే వచ్చే అవకాశాలు మెరుగయ్యాయి.

**కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ మధ్య ఒప్పందం**

కొత్తగూడెంలో మొదటి రెండున్నరేళ్లు సీపీఐకి మేయర్ పదవి, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి, తర్వాత రెండున్నరేళ్లు కాంగ్రెస్‌కు మేయర్ పదవి, సీపీఐకి డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని అంగీకారం కుదిరింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి చర్చలు జరిపారు. శనివారం రాత్రి జూబ్లీహిల్స్‌లో సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయన.. కొత్తగూడెంలో పార్టీల బలాబలాలను వివరించి మేయర్ పదవిని సీపీఐకి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. సీఎంతో సమావేశం అనంతరం విడిగా పొంగులేటి, మహేశ్‌కుమార్‌గౌడ్, వేంనరేందర్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమై చర్చించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఒప్పంద వివరాలు తెలిపారు. ఎన్నికలకు ముందు సమాచార లోపం వల్ల కొత్తగూడెంలో రెండు పార్టీలు స్నేహపూర్వకంగా పోటీ చేశాయన్నారు. అలాగే క్యాతనపల్లిలో కూడా ఒక అవగాహనకు వస్తామని ఆయన తెలిపారు. పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ రాజకీయ పరిస్థితుల దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌తో కలిసి నడవాలని నిర్ణయించామన్నారు. కొత్తగూడెంలో చెరో రెండున్నరేళ్ల పదవులు పంచుకుంటామని పేర్కొన్నారు.

**అక్కడ ఏం జరుగుతుందో?**

కరీంనగర్ మేయర్ పీఠం విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మేయర్ పీఠం కైవసం చేసుకునేందుకు అవసరమైన మెజారిటీ చేరువగా భాజపా వచ్చినప్పటికీ.. ఆ పార్టీని నిలువరించేందుకు ప్రత్యర్థి పార్టీలు పావులు కదుపుతున్నాయి. మొత్తం 66 డివిజన్లలో 30 సాధించి భాజపా పెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 14, భారాసకు 9, ఎంఐఎంకు మూడు దక్కగా 10 మంది స్వతంత్రులున్నారు. ఇక్కడ మేయర్ పీఠాన్ని సాధించాలంటే 35 మంది సభ్యుల బలం కావాలి. ఫలితాలొచ్చిన రోజే ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఒకరు, మరో స్వతంత్ర అభ్యర్థి భాజపాలో చేరారు. శనివారం రాత్రి మాసం గణేశ్, వేముల కవిత అనే ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా భాజపా కండువా కప్పుకొన్నారు. వీరితో కలిపి భాజపా బలం 34కు చేరగా.. ఎక్స్ అఫీషియోగా సంజయ్ ఓటుతో మేజిక్ ఫిగర్ 35కి చేరుకోవచ్చు. కానీ ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి చక్రం తిప్పడంతో మేయర్ పదవికి తాజాగా స్వతంత్ర అభ్యర్థి కొమురయ్య పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్, ఎంఐఎంకు కలిపి 17 మంది సభ్యులుండగా, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఒకరు, మరో ఐదుగురు స్వతంత్రులు వీరి శిబిరంలోనే తలదాచుకున్నట్లు తెలుస్తోంది. భారాస నుంచి గెలిచిన తొమ్మిది మందిని కూడా కలుపుకొంటే 32 మంది సభ్యులవుతారు. వీరంతా కొమురయ్యకు మద్దతు తెలిపేందుకు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఓటింగ్ సమయంలో ఏదైనా జరగొచ్చనే ధీమాతో చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. విప్ జారీ చేయకుండా ఓటింగ్ దిశగా ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. భాజపా మాత్రం మేయర్ పీఠం తమకే దక్కుతుందన్న ధీమాగా ఉంది.

## టార్గెట్ 90

-మొదటిపేజీ తరువాయి

కూడా పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళిపై చర్చించిన మంత్రులు.. ప్రజాతీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రభుత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితమే ఈ విజయమని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. అలాగే పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయంతో ముందుకు నడిపిన మహేశ్‌కుమార్‌గౌడ్, రేవంత్‌రెడ్డిని మంత్రులు అభినందించారు.

**ఫలితాలు మనకు బూస్టప్**

మంత్రులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కలసికట్టుగా పనిచేయడం వల్లే సత్ఫలితాలు సాధించామన్నారు. పార్టీ విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ ఫలితాలు పార్టీకి బూస్టప్ ఇచ్చాయని చెప్పారు. మొత్తం 70కిపైగా మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ స్పష్టమైన విజయం సాధించిందని.. హంగ్ ఏర్పాటైన చోట్ల కూడా స్వతంత్రులు, కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని వీలైనన్ని ఎక్కువ మున్సిపాలిటీల్లో పార్టీ జెండా ఎగరేసేలా మంత్రులు పనిచేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన బాధ్యతను పార్లమెంటు ఇన్‌చార్జి మంత్రులకే అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఫలితాలపై పార్టీ అగ్ర నాయకత్వం కూడా సంతృప్తి వ్యక్తం చేసిందన్న సీఎం.. త్వరలోనే పరిషత్ ఎన్నికలకు కూడా సిద్ధంగా ఉండాలనే సంకేతాలు ఇచ్చారు.

**బీఆర్ఎస్‌ను నమ్మలేదు.. బీజేపీ బలపడలేదు**

ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని.. పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలపడుతోందన్న వాదనలో నిజం లేదని ఈ ఫలితాలు చెబుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను ప్రజాప్రభుత్వం రెండేళ్లలోనే చేసి చూపిందని.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజాపాలనపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాయన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని, ఎన్నికలు ఏవైనా ఇదే స్ఫూర్తిని చాటాలని మంత్రులకు సూచించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అజహరుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పార్టీ ముఖ్య నేతలు వేం నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చిన్నారెడ్డి హాజరవగా ఆన్‌లైన్ ద్వారా మంత్రులు ఉత్తమ్, దామోదర, తుమ్మల, మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**మంత్రులకు పని విభజన**

పార్టీపరంగా సమస్యలున్న మున్సిపాలిటీల్లో అందరితో మాట్లాడే బాధ్యతను మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి అప్పగించారు.జగిత్యాల పంచాయతీని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కు అప్పగించిన సీఎం.. కొత్తగూడెం బాధ్యతను పొంగులేటికి, కరీంనగర్ కార్పొరేషన్ బాధ్యతను శ్రీధర్‌బాబు, పొన్నం, నిజామాబాద్ కార్పొరేషన్ బాధ్యత మహేశ్‌గౌడ్, ఉత్తమ్‌కు అప్పగించారు.

## 'మున్సిపోల్స్'లో కాంగ్రెస్‌కు 40% ఓట్లు

-మొదటిపేజీ తరువాయి

తగ్గలేదు. గత ఎన్నికల్లో వచ్చిన 15 శాతం ఓట్లను మళ్లీ నిలబెట్టుకుంది. 2020 మున్సిపల్ ఎన్నికల్లో 5.5 లక్షల ఓట్లు పొందిన బీజేపీకి ఈసారి మరో 42 వేల ఓట్లు పెరిగి మొత్తం 5,92,823 ఓట్లు పోలయ్యాయి. ఎంఐఎం కూడా తన 3% ఓట్లను పదిలపర్చుకుంది. 2020 ఎన్నికల కంటే ఆ పార్టీ కి 3 వేల ఓట్లు అదనంగా వచ్చాయి. కాగా, ఈసారి మూడు ప్రధాన పార్టీ ల తర్వాత అత్యధికంగా ఓట్లు తెచ్చుకుంది స్వతంత్రులే. ఇండిపెండెంట్లుగా పోటీ చేసిన అభ్యర్థులకు పోలైన మొత్తం ఓట్లలో 8.3 శాతం ఓట్లు అంటే 3,14,096 ఓట్లు వచ్చా యని ఈసీ ప్రకటించింది. ఎంఐఎంతో సహా సీపీఐ, సీపీఎం, ఆలిండియా ఫా ర్వర్డ్ బ్లాక్, జేఎస్పీ, బీఎస్పీ, ఆప్, ఎంబీటీ, ఐయూఎంఎల్.. ఇలా అన్ని పార్టీ ల ఓట్లు కలిపినా ఇండిపెండెంట్ల కంటే తక్కువే కావడం గమనార్హం.

## మేడిగడ్డ పునరుద్ధరణ ఖర్చు మీదే!

హైదరాబాద్:

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణకు అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టడంతోపాటు పునరుద్ధరణ చర్యల విషయంలో నీటిపారుదల శాఖ, సెంట్రల్ పవర్ అండ్ వాటర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్), డిజైన్ కన్సల్టెంట్‌కు పూర్తి సహకారం అందించాలని బరాజ్ నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీపీఈఎస్ జాయింట్ వెంచర్'ను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆదేశించింది. సిబ్బంది, సామగ్రి, యంత్రాలను బరాజ్ వద్దకు తరలించాలని స్పష్టం చేసింది. తమ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఇటీవల లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేసింది. పరస్పర అంగీకారంతో రూపొందించే నిబంధనల ప్రకారమే బరాజ్ పునరుద్ధరణ పనులు చేపట్టాలంటూ 'ఎల్ అండ్ టీ'ప్రత్యుత్తరం రాయడాన్ని ప్రభుత్వం తప్పుబట్టింది. పరస్పర అంగీకారమనే ప్రశ్న ఉత్పన్నం కాదని.. తమ ఆదేశాలను పాటించాల్సిందేనని తేల్చిచెప్పింది. కేవలం నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంతో ఒప్పంద కాలంలోనే బరాజ్‌కు నష్టం జరిగిందని.. బరాజ్ పునరుద్ధరణను పూర్తిగా సొంత ఖర్చుతో చేపట్టాలని 'ఎల్ అండ్ టీ'కి స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ రామగుండం సూపరింటెండింగ్ ఇంజనీర్ ఈ నెల 3న 'ఎల్ అండ్ టీ'కి మరో లేఖ రాశారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో నిర్మాణ సంస్థ ఒప్పందాన్ని తీవ్రంగా ఉల్లంఘించిందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ), జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు తమ నివేదికల్లో తేల్చడాన్ని గుర్తుచేశారు. పునరుద్ధరణ చర్యల్లో ఈ సంస్థల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం లేఖలో ఆదేశించింది. నీటిపారుదల శాఖ నియమించే డిజైన్ కన్సల్టెంట్ నుంచి అవసరమైన ఇన్‌పుట్స్ అందిన వెంటనే బరాజ్ పునరుద్ధరణకు సహకరిస్తామని నిర్మాణ సంస్థ పేర్కొన్న విషయాన్ని ప్రభుత్వం లేఖలో ప్రస్తావించింది. పునరుద్ధరణ పనుల డిజైన్ల తయారీ కోసం ఆర్ఫీ ఇండియా లిమిటెడ్ సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశామని.. త్వరలో ఒప్పందం చేసుకోనున్నామని తెలియజేసింది.

## అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు డీవోపీటీ అనుమతి

హైదరాబాద్

ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి, రెవెన్యూశాఖ (విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) అనుమతిచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. ఇదే కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఇప్పటికే అనుమతించిన నేపథ్యంలో న్యాయస్థానంలో అభియోగాల నమోదుకు ఏసీబీకి మార్గం సుగమమైంది. హైదరాబాద్‌లో ఈ-రేస్ నిర్వహణ వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ-రేస్ నిర్వహణ క్రమంలో హెచ్ఎండీఏకు రూ.75.88 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు.. ఇదే సమయంలో ఫార్ములా ఈ-ఆపరేషన్స్ సంస్థకు రూ.46 కోట్ల మేర లబ్ధి చేకూరినట్లు దర్యాప్తు క్రమంలో వెల్లడైంది. ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థను తొలుత ఒప్పందంలో చేర్చేందుకు.. తర్వాత ఆ సంస్థకు నష్టం వాటిల్లకుండా సురక్షితంగా తప్పించేందుకు క్విడ్‌ప్రోకో జరిగినట్లు ఏసీబీ అభియోగం. ఈ క్రమంలోనే రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు భారాసకు సమకూరినట్లు గుర్తించింది. అప్పట్లో పురపాలకశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆమోదంతోనే నాడు హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న అర్వింద్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి నిధుల్ని చెల్లించినట్లు తేలడంతో వీరిని నిందితులుగా

# పట్టణాలకు మహర్దశ

న్యూఢిల్లీ

నగరాలు, పట్టణాలను ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజిన్లుగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, వాటి అభివృద్ధి కోసం అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం శనివారం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ పథకానికి కేంద్ర సాయంగా ఏకంగా రూ.లక్ష కోట్లను కేటాయించింది! ఈ పథకం 202526 నుంచి 203031 ఆర్థిక సంవత్సరం దాకా ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. అనంతరం అవసరాన్ని బట్టి మరింతకాలం పొడిగిస్తారు.

**అప్పు తెస్తే కేంద్రం సాయం!**

నగరాలు తమ కాళ్లపై తాము నిలబడేలా, మార్కెట్ నుంచి నిధులు సమీకరించుకునేలా యూసీఎఫ్‌ను కేంద్రం రూపొందించింది. ఇందులో భాగంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేపట్టే పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల్లో 25% నిధులను యూసీఎఫ్ కింద కేంద్రం ఇస్తుంది. ఇందుకోసం ప్రాజెక్టు నిధుల్లో కనీసం 50 శాతాన్ని రాష్ట్రాలు మార్కెట్ నుంచి సమీకరించాల్సి ఉంటుంది. మున్సిపల్ బాండ్లు, బ్యాంక్ రుణాలు లేదా పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) వాటిని సమకూర్చుకోవాలి.
మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, లేదా స్థానిక సంస్థలు భరించాలి. యూసీఎఫ్‌తో రాబోయే ఐదేళ్లలో దేశ పట్టణాభివృద్ధి రంగంలో ఏకంగా రూ.4 లక్షల కోట్ల మేరకు పెట్టుబడులు వెల్లువెత్తుతాయని కేంద్రం అంచనా వేస్తోంది. పట్టణాభివృద్ధిలో గ్రాంట్ ఆధారిత విధానం స్థానంలో మార్కెట్, సంస్కరణల ఆధారిత విధానానికి ఇది నాంది పలుకుతుందని ఒక ప్రకటనలో పేర్కొంది.

**చిన్న పట్టణాలకు రూ.5,000 కోట్ల నిధి**

యూసీఎఫ్ పథకంలో భాగంగా పోటీతత్వానికి కేంద్రం తెర తీసింది. పారదర్శకంగా, సంస్కరణలు అమలు చేసే నగరాలకే ప్రాధాన్యమిస్తారు. పాలనలో డిజిటల్ విధానాలు, ఆర్థిక క్రమశిక్షణ, అర్బన్ ప్లానింగ్ సంస్కరణలు అమలు చేసే నగరాలు రేసులో ముందుంటాయి. అంతేగాక టైర్2, టైర్3 నగరాలు, ముఖ్యంగా లక్ష లోపు జనాభా ఉన్న చిన్న పట్టణాల కోసం రూ.5,000 కోట్లతో ప్రత్యేక కార్పస్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు, కొండ ప్రాంతాల్లో లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాలు మార్కెట్ రుణాలు పొందడానికి కేంద్రం 'క్రెడిట్ రీపేమెంట్ గ్యారంటీ'ఇస్తుంది. దీనికింద తొలిసారి రుణాలకు రూ.7 కోట్లు లేదా రుణ మొత్తంలో 70% దాకా కేంద్రమే గ్యారంటీగా ఉంటుంది.

**మూడు రంగాలపై ఫోకస్**

యూసీఎఫ్ ద్వారా మూడు రకాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తారు...

- నగరాల విస్తరణ, ఆర్థిక కారిడార్లు, రవాణా వ్యవస్థ మెరుగుదల
- పాత బస్తీలు, హెరిటేజ్ ప్రాంతాల ఆధునీకరణ, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, విపత్తుల నుంచి రక్షణ
- తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ (స్వచ్ఛత), నీటి వనరుల రక్షణ ఎవరికి వర్తిస్తుంది?
- 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాజధానులు
- లక్ష జనాభా దాటిన పారిశ్రామిక నగరాలు
- చిన్న పట్టణాలు (గ్యారెంటీ స్కీమ్ కింద)

**కేబినెట్ ఇతర నిర్ణయాలు**

ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. వేల కోట్ల రూపాయలతో కూడిన పలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్ వాటిని మీడియాకు వెల్లడించారు...

- తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్రల్లో రూ.11 వేల కోట్ల రోడ్డు ప్రాజెక్టులకు అనుమతి
- అస్సాంలో రూ.18,662 కోట్లతో బ్రహ్మపుత్ర నది కింద దేశంలోనే తొలి అండర్ వాటర్ రైల్, రోడ్డు ట్విన్ టన్నెల్ ప్రాజెక్టు. దీన్ని గోహ్‌పూర్‌నుమాలిగఢ్ నడుమ 34 కి.మీ. పొడవున నిర్మించనున్నారు
- కసారామన్మాడ్, ఢిల్లీఅంబాలా, బళ్లారిహోస్పేట నడుమ మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణం నిమిత్తం రూ.18,509 కోట్లతో మూడు భారీ ప్రాజెక్టులు
- రూ.10 వేల కోట్లతో తలపెట్టిన స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం
- నోయిడా మెట్రో రైల్ ప్రాజెక్టు 11.56 కి.మీ. మేరకు విస్తరణ.
- ప్రధాని కార్యాలయాన్ని రైసినా హిల్స్‌లోని సౌత్ బ్లాక్ నుంచి నూతనంగా నిర్మించిన సేవా తీర్థ్‌లోకి మార్చడం పట్ల కేంద్ర మంత్రివర్గం హర్షం వెలిబుచ్చింది. శుక్రవారం సౌత్‌బ్లాక్ కార్యాలయంలో జరిగిన చివరి మంత్రివర్గ భేటీలో ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. "సేవా తీర్థ్ చరిత్ర, భవిష్యత్తుల కూడలి. గతకాలపు బానిసత్వం నుంచి భవిష్యత్ వికసిత భారత్ దిశగా వేసిన ముందడుగు"అని అభివర్ణించింది.

# శాంతిభద్రతలను పరిరక్షిస్తా

ఢాకా

దాదాపు 18 నెలలుగా కొనసాగుతున్న అరాచకత్వ, అనిశ్చితికి చరమగీతం పాడుతూ ఇకపై తమ పరిపాలనలో శాంతిభద్రతకు పెద్దపీట వేస్తామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ ప్రకటించారు. తాజాగా జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో మూడింట రెండొంతుల స్థానాలను కైవసంచేసుకుని ఘనవిజయం సాధించిన బీఎన్‌పీ పార్టీ త్వరలోనే అధికార పగ్గాలు చేపట్టనున్న నేపథ్యంలో రెహ్మాన్ శనివారం ఢాకాలో తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. "దేశంలో శాంతిభద్రతల స్థాపన కోసం ఎందాకైనా వెళ్తాం. ఇందుకోసం ప్రతి ఒక్కరి సహకారం మాకు కావాలి. అప్పుడే మేం సురక్షితమైన, మానవీయ బంగ్లాదేశ్‌ను సాకారంచేయగలం. ఎంతటి భారీమూల్యం చెల్లించైనాసరే శాంతిభద్రతలను పరిరక్షిస్తాం. అందరి భాగస్వామ్యంతో ఫాసిజంరహిత దేశ ప్రగతి ప్రయాణం ఆరంభమైంది. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరి అభిప్రాయానికి విలువనిస్తాం. సుస్థిర బంగ్లాదేశ్‌ను నిర్మిస్తాం"అని అన్నారు.

**4 రోజుల్లో ప్రమాణస్వీకారం**

ప్రధానిగా తారిఖ్‌తో పాటు కేబినెట్ మంత్రుల ప్రమాణస్వీకారోత్సవం మరో నాలుగు రోజుల్లో జరిగే అవకాశం ఉందని బీఎన్‌పీ నేత మొహమ్మద్ షాహబుద్దీన్ చెప్పారు. ప్రెసిడెన్షియల్ ప్యాలెస్(బంగభవన్)లో తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవం ఉంటుందని కేబినెట్ కార్యదర్శి షేక్ అబ్దుర్ రషీద్ చెప్పారు. ఫిబ్రవరి 16 లేదా 17వ తేదీన ప్రమాణస్వీకారం ఉండొచ్చని బీఎన్‌పీ సీనియర్ నేత ఒకరు అన్నారు.

**భారత్‌తో బంధంపై..**

తారిఖ్ తల్లి, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కాలంలో భారత్, బంగ్లాదేశ్ సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఈ నేపథ్యంలో త్వరలో ప్రధాని హోదాలో ఆయన భారత్‌లో ఎలా మెలగాలనుకుంటున్నారని మీడియా ప్రశ్నించింది. "మా దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూనే భారత్‌తో విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తాం. దక్షిణాసియాలో అతిపెద్ద శక్తులైన భారత్, చైనా, పాకిస్తాన్‌లతో సమస్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తాం. వీటిల్లో ఏ ఒక్క దేశాన్ని మాకు గురువుగా పరిగణించబోం. దేశ అత్యుత్తమ ప్రయోజనాలు, దేశ ప్రజల మార్గదర్శకత్వంలోనే మా విదేశాంగ విధానం రూపుదిద్దుకోబోతోంది"అని ఆయన వ్యాఖ్యానించారు. "ఢిల్లీలో తలదాచుకున్న మా దేశ మాజీ మహిళా ప్రధాని షేక్ హసీనాను తిరిగి అప్పగించడం అనేది చట్టపరమైన ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది. సార్క్ పునరుజ్జీవానికి కృషి చేస్తా" అని అన్నారు.

**ప్రధాని మోదీకి ఆహ్వానం!**

భారత్, బంగ్లా సంబంధాల మెరుగుదల కోసం బీఎన్‌పీ ప్రయత్నిస్తోంది. ఇందుకు తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవ సందర్భాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. ప్రధానిగా తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవానికి భారత ప్రధాని మోదీని ఆహ్వానించాలని బీఎన్‌పీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. చైనా, పాకిస్తాన్ అగ్రనేతలకూ ఆహ్వానాలు పంపాలని పార్టీ ఉన్నత వర్గాలు యోచిస్తున్నాయి. షేక్ హసీనా కాలంలో భారత్‌బంగ్లాదేశ్ బంధం బలంగా ఉండేది. ఆ బంధం చిరకాలం పటిష్టంగా కొనసాగాలంటే తారిఖ్ ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని మోదీ హాజరు కావడమే ఉత్తమమనే మాటా వినవస్తోంది.

# ఈశాన్యంలో చొరబాట్లు... కాంగ్రెస్ పుణ్యమే!

గువాహటి



కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఈశాన్య భారతదేశంలో అభివృద్ధిని దశాబ్దాలుగా కాంగ్రెస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అంతేగాక ఈ ప్రాంతంలో చొరబాట్లను విపరీతంగా ప్రోత్సహించింది"అంటూ దుయ్యబట్టారు. చొరబాటుదారులను కాపాడిన, కాపాడుతున్న చరిత్ర ఆ పార్టీదేనని ఆక్షేపించారు. అక్రమ వలసలకు అడ్డుకట్ట వేసేందుకు బీజేపీ కంకణం కట్టుకుందని చెప్పారు. అస్సాంలో ఒక్క రోజు పర్యటనలో భాగంగా శనివారం గువాహటిలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. కాంగ్రెస్ తన హయాంలో దేశ భద్రతను నిత్యం ప్రమాదంలో నెట్టిందంటూ మండిపడ్డారు. ఆ పార్టీ పాలనలో అస్సాంలో నిత్యం భయం, అభద్రతలే రాజ్యమేలాయని ఆరోపించారు. "కాంగ్రెస్ నిత్యం సమాజంలో విభజనను ప్రోత్సహించింది. ఓటుబ్యాంకు రాజకీయాల్లో మునిగి తేలింది. దేశ భద్రతను గాలికొదిలేసింది. చివరికి ఆయుధాల కొనుగోళ్లలో కూడా భారీ కుంభకోణాలకు పాల్పడింది. గతంలో ముస్లిం లీగ్ వల్ల దేశ విభజన జరిగింది. కానీ ఇప్పుడు మావోయిస్టులు, ముస్లిం లీగ్, కాంగ్రెస్ (ఎంఎంసీ)లతో దేశానికి ముప్పు పొంచి ఉంది. వీటిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి"అని ప్రధాని సూచించారు.

**'డబుల్ ఇంజన్'కే ఓటెయ్యండి**

వచ్చే ఐదేళ్ల కాలం అస్సాంకు చాలా కీలకమని మోదీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీజేపీని గెలిపించి డబుల్ ఇంజన్ సర్కారును కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడం ఒక్కటే బీజేపీ లక్ష్యం కాదని, ప్రజల హృదయాలు గెలవడం తమకు ముఖ్యమని చెప్పారు. "70 ఏళ్లలో బ్రహ్మపుత్ర నదిపై కాంగ్రెస్ కేవలం మూడు వంతెనలు నిర్మించింది. మేం పదేళ్లలోనే ఐదు బ్రిడ్జిలు కట్టి చూపించాం. మా ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతోంది. అస్సాంను వేగంగా అభివృద్ధి చేసేందుకు, అన్ని రంగాల్లోనూ రాష్ట్ర అస్తిత్వాన్ని, సంప్రదాయాలను పరిరక్షించేందుకు బీజేపీ కంకణం కట్టుకుంది. 2014 నుంచి ఈశాన్యానికి చెందిన 125 మంది పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు"అని మోదీ చెప్పారు. బీజేపీకి కార్యకర్తలే ప్రాణవాయువని, పార్టీకి ఎనలేని బలమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల వేళ ప్రతి పౌరునికీ చేరువ కావాలని కార్యకర్తలకు సూచించారు. "మేం విశ్వసించేది వ్యవస్థాగతమైన బలాన్నే. నేను బీజేపీ కార్యకర్తను. అది నాకు గర్వకారణం. అదే నా అతి పెద్ద అర్హత. అస్సాం ప్రజలు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. దానికి అభివృద్ధి రూపంలో వడ్డీతో సహా బదులు చెల్లించుకుంటాను"అని ప్రకటించారు.

**పలు ప్రాజెక్టులు ప్రారంభం**

కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అస్సాంలో రూ.5,500 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. వీటిపై బ్రహ్మపుత్రా నదిపై భారీ వంతెన, ఐఐఎం, డేటా సెంటర్ తదితరాలున్నాయి. ఐఐఎంగువాహటిని గువాహటి సమీపంలోని పలాస్‌బరిలో, హైటెక్ డేటా సెంటర్‌ను కామరూప్ జిల్లాలోని అమీన్‌గావ్‌లో నిర్మించారు. వీటితో పాటు పీఎంఇబస్ సేవా పథకం కింద మంజూరైన 225 ఎలక్ట్రిక్ బస్సులను కూడా మోదీ జెండా ఊపి ప్రారంభించారు.

**బ్రహ్మపుత్రపై భారీ బ్రిడ్జి**

బ్రహ్మపుత్రా నదిపై రూ.3,030 కోట్లతో నిర్మించిన కుమార్ భాస్కర్ వర్మ సేతును మోదీ ప్రారంభించారు. అనంతరం బ్రిడ్జిపై నడుస్తూ దాన్ని పరిశీలించారు. అప్రోచ్ రోడ్లు, ఫ్లై ఓవర్లతో కలిపి ఇది 7.75 కి.మీ. పొడవుంటుంది. సువిశాలమైన ఈ ఆరు లేన్ల బ్రిడ్జి వల్ల గువాహటి, ఉత్తర గువాహటి నడుమ ప్రయాణ సమయం ఇకపై కేవలం ఏడు నిమిషాలకు తగ్గనుంది. ప్రస్తుతం సరాయ్‌ఘాట్ బ్రిడ్జి మాత్రమే వాటిని అనుసంధానిస్తోంది. దానిపై బ్రహ్మపుత్రను దాటేందుకు కనీసం 30 నిమిషాలు పడుతుంది. కొత్త బ్రిడ్జిని భారీ భూకంపాలను కూడా తట్టుకునేలా ఎక్స్‌ట్రా డోస్డ్ ప్రీ స్ట్రెస్డ్ కాంక్రీట్‌తో నిర్మించారు. ఈశాన్య భారతదేశంలో ఈ టెక్నాలజీతో నిర్మించిన తొలి బ్రిడ్జి ఇదే. దీని నిర్మాణానికి 2019లో మోదీయే శంకుస్థాపన చేశారు. 2020 లో నిర్మాణ పనులు మొదలయ్యాయి.

## ఈఎల్‌ఎఫ్‌పై ల్యాండైన మోదీ

గువాహటి/మోరాన్: ఈశాన్య భారతదేశంలో నిర్మితమైన తొలి హైవేరన్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో మోరాన్ సమీపంలో నేషనల్ హైవే 37పై సిద్ధం చేసిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్‌ఎఫ్)పై వాయుసేనకు చెందిన సీ130జె రవాణా విమానంలో ప్రధాని దిగారు. అనంతరం దాన్ని లాంఛనంగా జాతికి అంకితం చేశారు. ఈశాన్య భారతదేశానికి తొలి ఈఎల్‌ఎఫ్ సదుపాయం అందుబాటులోకి రావడం నిజంగా గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రాకృతిక విపత్తులు తదితర సమయాల్లో ఈ సదుపాయం ఎంతగానో ఉపయోగపడుతుందని హర్షం వెలిబుచ్చారు.

**అబ్బురపరిచిన ఏరియల్ షో**

మోదీ ఒక రోజు పర్యటన నిమిత్తం శనివారం అస్సాం చేరుకున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి ఆయన చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, రాష్ట్ర మంత్రులు తదితరులు ప్రధానికి స్వాగతం పలికారు. అనంతరం సీ130జె హెర్క్యులస్ విమానంలో ఆయన ఈఎల్‌ఎఫ్‌కు చేరుకున్నారు.
రన్‌వేపై దిగాక సమీపంలో సిద్ధం చేసిన వేదికకు చేరుకున్నారు. అనంతరం ఈఎల్‌ఎఫ్‌పై వాయుసేన నిర్వహించిన ప్రత్యేక ఏరియల్ షోను వీక్షించారు. 20 నిమిషాలకు పైగా సాగిన ఈ షో ఆహూతులకు కనువిందు చేసింది. యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పైలట్లు ఈఎల్‌ఎఫ్‌పై కచ్చితత్వంతో ల్యాండింగ్, టేకాఫ్‌తో పాటు పలు విన్యాసాలు నిర్వహించారు. స్థానికులు భారీ సంఖ్యలో వాటిని వీక్షించారు. తొలుత సుఖోయ్ 30 ఎంకేఐ, దాని వెనకే రఫేల్ ఈఎల్‌ఎఫ్ నుంచి టేకాఫ్ అయ్యాయి. తర్వాత ఏఎన్32 హెలికాప్టర్ టచ్ అండ్ గో విన్యాసాలు ప్రదర్శించింది. తర్వాత మూడేసి చొప్పున తొలుత సుఖోయ్, తర్వాత రఫేల్ యుద్ధ విమానాలు ప్రత్యేక విన్యాసాలతో అలరించాయి. విపత్తుల వేళ చేపట్టే సహాయక చర్యల సన్నద్ధతను ప్రత్యేకంగా తయారు చేసిన అధునాతన దేశీయ హెలికాప్టర్లు (ఏఎల్‌హెచ్) కళ్లకు కట్టాయి. అనంతరం ప్రధాని గువాహటి చేరుకున్నారు.

**ఎన్నోవిధాలుగా కీలకం**

అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో నిర్మించిన ఈఎల్‌ఎఫ్ వ్యూహాత్మకంగా ఎన్నోవిధాలుగా అత్యంత కీలకమైనది. ఈ ఈఎల్‌ఎఫ్ చైనాకు 300 కి.మీ., మయన్మార్‌కు కేవలం 200 కి.మీ. దూరంలో ఉంటుంది. 4.2 కి.మీ. పొడవైన ఈ హైవేరన్‌వేను రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించారు. సైనిక, పౌర అవసరాలు రెండింటికీ పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా వాయుసేన సహకారంతో దీన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. పొరుగు దేశాలతో ఘర్షణల వేళ ప్రత్యర్థులు సమీపంలోని వైమానిక స్థావరాలపై దాడులు చేస్తే బలగాల తరలింపు తదితరాలకు తక్షణ సదుపాయంగా ఈఎల్‌ఎఫ్ కీలకపాత్ర పోషిస్తుంది. విపత్తులు, ఎమర్జెన్సీ సమయాల్లో దిబ్రూగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగా కూడా పని చేస్తుంది. దిబ్రూగఢ్‌మోరాన్ జాతీయ రహదారి37పై నిర్మించిన ఈఎల్‌ఎఫ్‌పై అన్నిరకాల యుద్ధ, రవాణా విమానాలనూ సులువుగా దించవచ్చు. రఫేల్, సుఖోయ్‌తో పాటు పలు భారీ రవాణా విమానాలు కూడా దీనిపై విజయవంతంగా ట్రయల్ రన్స్ నిర్వహించాయి. 40 టన్నుల బరువైన యుద్ధ విమానాలతో పాటు ఏకంగా 74 టన్నుల రవాణా విమానాలు కూడా దీనిపై సునాయాసంగా దిగవచ్చు. భారత్‌లో తొలి ఈఎల్‌ఎఫ్ రాజస్తాన్‌లోని బార్మేర్ జిల్లాలో 2021లో నిర్మితమైంది. అనంతరం మధ్య, ఉత్తర భారతంలో కూడా పలు ఈఎల్‌ఎఫ్‌లు అందుబాటులోకి వచ్చాయి.

## ఇక జనరల్ బోగీల్లోనూ నిరంతరం శుభ్రత

దిల్లీ




రైల్వే శాఖలో కొత్త సంస్కరణల్లో భాగంగా ఇకమీదట రిజర్వ్ బోగీలతోపాటు జనరల్ బోగీల్లోనూ ప్రతి గంటకోసారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఆయన శనివారం సాయంత్రం ఇక్కడి రైల్‌భవన్‌లోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తొలివిడతలో భాగంగా... దేశవ్యాప్తంగా 80 రైళ్లల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటిలో దక్షిణ మధ్య రైల్వే నుంచి 5 రైళ్లను ఎంపిక చేశారు. ఆరునెలల తర్వాత ఈ సౌకర్యాన్ని మరో 80 రైళ్లకు విస్తరిస్తామని, క్రమేణా మూడేళ్లలో అన్ని రైళ్లలోని జనరల్ బోగీలనూ శుభ్రపరిచే దిశగా వెళ్తామని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రైలు బయలుదేరిన చోటునుంచి గమ్యస్థానం చేరేవరకు రద్దీగా ఉండే సమయాల్లో ప్రతి గంటకోసారి, మిగతా సమయాల్లో గంటన్నరకోసారి శుభ్రత కార్యక్రమాలు కొనసాగించబోనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రయాణికులపై అదనపు ఛార్జీల భారమేమీ వేయబోమని స్పష్టంచేశారు. శుభ్రత కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రతి రైలులో ఒక ప్రొఫెషనల్ బృందాన్ని, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఈ కంట్రోల్‌రూం ద్వారా రైళ్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు ఏఐ ఆధారంగా పరిశీలించి సేవల నాణ్యతను మదింపుచేయనున్నట్లు చెప్పారు. రైళ్లలో దిండ్లు, దుప్పట్ల సరఫరాతోపాటు, చిన్న చిన్న రిపేర్ పనులన్నింటినీ ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని వెల్లడించారు. రైళ్ల పరిశుభ్రత కోసం నియమించే సిబ్బందికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీచేయనున్నారు. ఈ పనులను పర్యవేక్షించే సూపర్వైజర్ కనీసం 12వ తరగతి లేదంటే ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.

## ఇండియా ఏఐ సదస్సు రేపటి నుంచే

న్యూఢిల్లీ




కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఏఐ సదస్సు సోమవారం నుంచి ఢిల్లీలో ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు సాగే ఈ సదస్సులో 20 దేశాల అధినేతలు, ముఖ్య నేతలతో పాటు దిగ్గజ ఏఐ కంపెనీల సీఈఓలు తదితరులు పాల్గొంటున్నారు. సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ 40 మందికి పైగా సీఈఓలతో భేటీ కానున్నారు. వీరిలో శామ్ ఆల్టమన్ (ఓపెన్‌ఏఐ), బిల్ గేట్స్, డేరియో అమొదెయ్ (ఆంత్రోపిక్) తదితరులున్నారు. భారత్‌లో పెట్టుబడి ప్రణాళికలను గురించి వీరంతా తమ ఆలోచనలను ప్రధానితో పంచుకోనున్నారు. ఈ సదస్సు సందర్భంగా పలు రంగాల్లో ఏకంగా 100 బిలియన్ డాలర్ల మేరకు ఏఐ పెట్టుబడులకు ఒప్పందాలు కుదరతాయని అంచనా. వచ్చే నాలుగేళ్లలో భారత్‌లో ఏకంగా రూ.15 లక్షల కోట్ల మేరకు పెట్టుబడి ప్రణాళికలను మైక్రోసాఫ్ట్ గత డిసెంబర్లో ప్రకటించడం తెలిసిందే. ఏఐ మౌలిక సదుపాయాలు, క్లౌడ్ సామర్థ్య పెంపు, అత్యాధునిక డిజిటల్ నైపుణ్యాల్లో లక్షలాది మంది యువతకు శిక్షణ తదితరాలపై ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. ఇందులో పాల్గొనేందుకు ఇప్పటికే ఏకంగా 2 లక్షల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారు. గత ఏఐ సదస్సులు పారిస్, సియోల్ తదితర నగరాల్లో జరిగాయి.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
ఆదివారం 15 ఫిబ్రవరి 2026


## సంపాదకీయం

# ప్రజారోగ్యంపై ఎందుకింత నిర్లక్ష్యం?

దేశంలో చుట్టుముడుతున్న ఆరోగ్య సంక్షోభం కేంద్ర పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. ఎందుకంటే, ఏ ప్రభుత్వానికైనా ప్రజల ఆరోగ్యమే మౌలిక బాధ్యత. కానీ, ఆ బాధ్యతనుంచి రోజురోజుకూ తప్పించుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే, ఆరోగ్యం పేరుతో ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తూనే, అదే స్థాయిలో ఆ రంగానికి నిధులు కేటాయిం చడంలో వెనుకంజ వేసింది. ముఖ్యంగా "హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సు" పేరుతో వసూలు చేస్తున్న మొత్తం, ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి తగిన విధంగా వినియోగించబడటం లేదన్న విమర్శలకు తాజా గణాంకాలే నిదర్శనం. ప్రస్తుతం ఆదాయపన్ను, కార్పొరేట్ పన్నులపై నాలుగు శాతం హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సును కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తోంది. 2023- 24లో ఈ సెస్సు ద్వారా సుమారు ఒక లక్షా పద్దెనిమిది వేల కోట్ల రూపాయలు వసూలయ్యాయి. 2024-25లో ఇది లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. 2026 బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ ఆదాయం లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలను దాటే అవకాశం ఉంది. అంటే ప్రజలు ప్రతి సంవత్సరం లక్ష కోట్లకు పైగా మొత్తాన్ని ప్రత్యేకంగా "ఆరోగ్యం" పేరుతో చెల్లిస్తున్నారు. అయితే ఇదే బడ్జెట్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు కేటాయించిన మొత్తం సుమారు తొంభై రెండు వేల కోట్ల రూపాయలకే పరిమితమైంది. ఆరోగ్యసెస్సు ద్వారా వసూలు చేస్తున్న మొత్తంతో పోలిస్తే ముప్పై నుంచి నలభై వేల కోట్ల రూపాయలు తక్కువగా ఆరోగ్య రంగానికి నేరుగా కేటాయిస్తున్నారు. ఇది కేవలం లెక్కల తేడా కాదు, ఆరోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఎంత వెనుకబడి ఉందో చెప్పే స్పష్టమైన సూచిక. కేంద్రం, రాష్ట్రాలు కలిపి ప్రభుత్వ ఆరోగ్య వ్యయం దేశ జీడీపీలో ఇంకా రెండు శాతంలోపే ఉంది. జాతీయ ఆరోగ్య విధానం-2017 ప్రకారం 2025 నాటికి ఈ వ్యయాన్ని జీడీపీలో రెండున్నర శాతానికి పెంచాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, తాజా బడ్జెట్ తర్వాత కూడా ఆ లక్ష్యం నెరవేరలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఐదు శాతం లక్ష్యంతో పోలిస్తే భారత్ చాలా వెనుకబడి ఉంది. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం తక్కువగా ఉండటంతో దాని ప్రభావం నేరుగా ప్రజలపై పడుతోంది. ప్రస్తుతం దేశంలో మొత్తం ఆరోగ్య ఖర్చుల్లో వ్యక్తిగత జేబు ఖర్చు సుమారు నలభై ఏడు శాతం వరకు ఉంది. అధికారిక ఆరోగ్య ఖాతాల ప్రకారం ప్రతి సంవత్సరం ఆరు నుంచి ఏడు కోట్ల మంది వైద్య ఖర్చుల కారణంగా పేదరికంలోకి జారిపోతున్నారు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలకమైన భాగమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్ల పరిస్థితి కూడా ఆందోళన కలిగించేదే. కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నప్పటికీ, వాటికి తగిన నిధులు, అధ్యాపకులు, పరికరాలు సమకూరడం లేదు. అనేక కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరత, ల్యాబ్‌లు, లైబ్రరీలు, హాస్టళ్ల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. టీచింగ్ హాస్పిటళ్లలో పడకలు, ఐసీయూ సదుపాయాలు, ఆధునిక పరికరాల కొరత వల్ల రోగుల సంరక్షణతో పాటు వైద్య విద్య నాణ్యత కూడా దెబ్బతింటోంది. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులపై రోగుల భారం రోజురోజుకీ పెరుగుతోంది. కానీ, ఆ భారం మోయడానికి అవసరమైన బడ్జెట్, మానవ వనరులు అందుబాటులో లేవు. ఫలితంగా విద్యార్థులు సరైన క్లినికల్ అనుభవం పొందలేకపోతున్నారు, అధ్యాపకులు బోధనకంటే సేవల భారంతో అలసిపోతున్నారు. ఇది భవిష్యత్తు వైద్యుల తయారీపైనే ప్రభావం చూపుతోంది. ఇంత జరుగుతున్నా, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సు ద్వారా వచ్చిన నిధులు చట్టపరంగా ప్రత్యేక ఆరోగ్యనిధిగా కేటాయించబడటం లేదు. ఈ మొత్తం కేంద్ర సమగ్రనిధిలో కలిసిపోతుంది. అంటే ఆరోగ్య పేరుతో వసూలు చేసిన డబ్బులో ఎంత భాగం నిజంగా ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, ప్రజారోగ్య కార్యక్రమాలకు ఖర్చయిందో ప్రజలకు స్పష్టమైన సమాచారం లేదు. ఈ పారదర్శకత లోపమే అసలు సమస్య. దేశంలో నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు మొత్తం మరణాల్లో అరవై శాతం కంటే ఎక్కువకు కారణమవుతున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు, వృద్ధుల ఆరోగ్య అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్య వ్యవస్థను, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను బలోపేతం చేయడం తప్పనిసరి. కానీ, తాజా బడ్జెట్‌లో ఆ దిశగా అవసరమైన పెట్టుబడి కనిపించడం లేదు. ప్రజల నుంచి ఆరోగ్యం పేరుతో ఏడాదికి లక్షల కోట్ల రూపాయలు వసూలు చేస్తూనే, అదే ఆరోగ్య రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం పాలనా వైఫల్యమే తప్ప వేరేకాదు. హెల్త్ సెస్సు పెరుగుతున్నప్పుడు ఆరోగ్య వ్యయమూ అదే స్థాయిలో పెరగాలి. కానీ, ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఆరోగ్యం వెనుకబడినట్టే కనిపిస్తోంది. ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వం మోయాల్సిన చోట, అది నెమ్మదిగా ప్రజల జేబుల పైకి మళ్లుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. హెల్త్ సెస్సును ప్రత్యేక ఆరోగ్య నిధిగా మార్చి, ప్రతి రూపాయి ఎలా ఖర్చవుతుందో ప్రజలకు చెప్పే పారదర్శక వ్యవస్థ కావాలి. అది లేకపోతే, ఈ సెస్సు ప్రజల ఆరోగ్యానికి కాదు, బడ్జెట్ లెక్కలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాల మీద వసూలు చేసే పన్నుకు ఇది తగిన న్యాయం కాదు.

# నేటి తరానికి ఆదర్శం ధర్మబిక్షం సేవాభావం

ఆయన స్వాతంత్ర్య సమర యోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం. బొమ్మ గాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళ కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి, కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని



నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి, ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. 1951-73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952-57, 1957-62, 1962-67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991-96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా. 1992-95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మబిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

# తెలుగునేలపై శైవమత వ్యాప్తి

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతల కు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ. 2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచా ర్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీము కుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ. 1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ. 253, 277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హారీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హారీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృథ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ. 358నుండి 569వరకు 210 ఏళ్ళ తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ. 440-495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జుననికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్టించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ. 850-895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ. 7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ. 1100-70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళ...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

# అలుపెరుగని పోరాట యోధుడు

నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆనాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమాలతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్‌సత్తా అని పేరెన్నికగన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్‌లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమాలతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యమాల నిర్వహణలో అలుపెరగక, ఏనాడూ రాజీపడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్షతో, అంకితభావంతో, అన్నింటినీ మించి చిత్తశుద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాటయోధుడు. 1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యాచరణను ఆయన వదిలిపెట్టలేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడంలో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తిచూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం. ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో, లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించ డమే కాక, వెంట ఉండి సహకరించే వారు. హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్.. విద్యార్థి జీవితంలోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు. 1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్‌లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు. ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువరించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు. ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లంనారాయణ, ఘంటా చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కే.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు.

# హర హర మహాదేవ శంభో శివ శంభో

## నేడు శివరాత్రి సందర్భంగా సుందరంగా ముస్తాబైన మహేశ్వరం శ్రీ శివగంగ శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం

## గంగా దేవి ఒడిలో కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరులు

## మహేశ్వరం కోనేరులో కొలువైన గంగాదేవి చుట్టూ 16 రూపాలలో శివయ్య దివ్య దర్శనం





**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య**

ఏ నామస్మరణతో సర్వ పాపాలు హరించిపోవునో, ఏ స్వామి సంకీర్తనలతో సకల శుభాలు కలుగునో అటువంటి ఆ మహా పరమేశ్వరుడి నామస్మరణం మన జన్మ జన్మల పుణ్యఫలం. అట్టి నామాన్ని పిలిచే దైవమే ఆ బోలా శంకరుడు. మహాశివరాత్రి సందర్భంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ రాజ రాజేశ్వరాలయం అత్యంత శోభాయమానంగా ముస్తాబైంది. భక్తుల కోసం ప్రత్యేక అలంకరణలు, విద్యుత్ దీపాలు, వసతులు కల్పించారు. శివాలయాలు మామిడి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా మారాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, ఆలయ కమిటీ చైర్మన్ ఆలె కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అందంగా ముస్తాబు చేశారు.

**ప్రత్యేక పూజలు:**

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తారు. వేలాదిగా వచ్చే భక్తుల కోసం క్యూలైన్లు, నీటి వసతి, భద్రతా ఏర్పాట్లు ఆలయ కమిటీ చైర్మన్ అలె కుమార్ తో కలిసి సభ్యులు పూర్తి చేశారు.

**మహా శివాలయం ప్రత్యేకత:**

సహజంగా శివుని తలపై గంగ ఉంటుంది. గంగలోనే శివుడు ఉండటం ఇక్కడ ఆలయ ప్రత్యేకత. ఆలయం కింది భాగంలోనే శ్రీ రాజేశ్వరి దేవి విగ్రహం ప్రతిష్ఠించారు. ఒకే చోట 16 రూపాలలో కొలువు దీరిన ఆ మహా శివుడి దర్శనం అంత సామాన్యం కాదు. అది ఈ దేవాలయంలో కనిపించే అరుదైన దృశ్యం. కాకతీయుల అద్భుత కళా నైపుణ్యంతో నిర్మించిన ఆలయం శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం. శ్రీ రాజరాజేశ్వరి, నాగదేవత, గంగాదేవి, విఘ్నేశ్వరుడు, మొత్తం కుటుంబం కొలువుదీరిన కైలాసం లాంటిదే ఈ ప్రదేశం.

**పురాణ ప్రకారం ఆలయం విశిష్టత**

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సమీపంలోని మహేశ్వరం మండల కేంద్రంలో కోనేరు మధ్యలో వెలుగొందుతున్న శివాలయం శివగంగ శ్రీ రాజరాజేశ్వరి పుణ్యక్షేత్రం. మహేశ్వరంలో 16 దేవాలయాలలో నీటి మధ్యలో పైన ఉండు అంతస్తులో శివాలయం, కింద అంతస్తులో శ్రీ రాజేశ్వరి దేవి ఆలయం ఉన్నాయి. పురాణాల ప్రకారం శ్రీ మహంకాళి పేరుతోనే మహేశ్వరం అనే పేరు ఈ ప్రాంతానికి వచ్చినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. శ్రీ రాజరాజేశ్వరుడు రాజేశ్వరితో కలిసి ఉద్భవించినట్లు ఇక్కడి భక్తుల విశ్వాసం. పురాణాల ప్రకారం గోల్కొండ నవాబు తానిషా కాలంలో అక్కన్న , మాదన్నలు 1673- 1680 మధ్య కాలంలో ఈ ఆలయాన్ని పునరుద్ధరించారనీ చరిత్ర తెలుపుతుంది. ఇది కాకతీయుల కాలంలో నిర్మించిన పుణ్యక్షేత్రం. ప్రపంచంలో మరెక్కడ ఇలాంటి నిర్మాణం లేదు. కాకతీయుల నైపుణ్యానికి ఇది చిహ్నంగా కనిపిస్తుంది. అక్కన్న, మాదన్న కాలంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరిగేవి. ఈ ఆలయం ఇతర ఆలయాల మాదిరిగా కాకుండా నీటిలో రెండు అంతస్తులు అలరారుతున్నాయి. 500 అడుగుల పొడవు, 250 అడుగుల వెడల్పుతో 16 శివాలయాల వివిధ నామాల పేర్లతో భక్తులకు దర్శనమిస్తున్నాడు.

కాకతీయుల కాలంలో శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అనే పేరు వచ్చింది. శివగంగలో కొలువు తీరిన ఆలయం భక్తులను మంత్ర ముగ్ధులను చేస్తుంది. ఆలయం ముందున్న చెట్టుకు ఒక చరిత్ర ఉంది రావి, వేపా, మేడి చెట్టు అల్లుకుని త్రి వృక్షంగా భాసిల్లుతుంది. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ ఆలయం దినదిన అభివృద్ధి చెందుతూ భక్తులకు కొంగు బంగారమైన క్షేత్రంగా విరాజిల్లుతుంది. పిల్లలు లేనివారు ఈ చెట్టుకు కొత్త కొబ్బరికాయ కడితే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం .ఈ త్రి వృక్షం కిందనే నాగదేవత ఆలయం ఉన్నది. ఆలయంలో ఉన్నంత సేపు భాహ్య ప్రపంచం గుర్తుకు రాదు. ఆ విధంగా ఈ ఆలయాన్ని అంత గొప్పగా నిర్మించారు. గర్భగుడిలో కొలువు తీరిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, పరమేశ్వరి దీటుగా భక్తులతో కుంకుమార్చన పూజలు అందుకుంటుంది.

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాము



మహేశ్వర మండల కేంద్రంలో కొలువైన పరమేశ్వరుడి ఆలయం రంగారెడ్డి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దేవాలయం. కోనేరులో కొలువైన గంగాదేవి చుట్టూ 16 రూపాలలో శివయ్య కొలువు తీరిన తీరు అపురూపం. శివాలయాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, తాగునీరు, వైద్య శిబిరాలు, భద్రతా చర్యలు కల్పించి, భక్తులు వేలాదిగా తరలివచ్చినా ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసాం.

**ఆలయ చైర్మన్ ఆలే రవికుమార్**

### ఆలయం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు



మహేశ్వరం శ్రీ రాజరాజేశ్వరి శివగంగ ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులు ప్రశాంతంగా, సులభంగా దర్శనం చేసుకోవడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ఆలయం వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాము. భక్తులు సహకరించాలని కోరారు.

**- మహేశ్వర సీఐ వెంకటేశ్వర్లు**

## గ్రీన్ హోమ్స్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృష




**ప్రతిఘటన, మహేశ్వరం :**

గత కార్పొరేటర్లు, పాలకుల నిర్వాహణలో నాదర్ గుల్ డివిజన్ లో విపరీతంగా అక్రమ కట్టడాలను ప్రోత్సాహించారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాదర్ గుల్ గ్రామంలో గ్రీన్ హోమ్స్ కాలనీని శనివారం కేఎల్ఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సరస్వతికి పలు సూచనలు చేశారు. అక్రమ నిర్మాణాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలంలో ఇండ్ల మధ్యలో పారే వరద నీరుతో ముప్పు పొంచి ఉందని కాలనీ వాసులు ఫిర్యాదు కె ఎల్ ఆర్ కు చేశారు. ప్రజలకు, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను కేఎల్ఆర్ కోరారు. నాదర్ గుల్ లో అక్రమ లేఅవుట్స్, నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేఎల్ఆర్ అధికారుకులకు సూచించారు. జీహెచ్ఎంసీ డివిజన్ లోని కాలనీ సమస్యలపై వెంటనే నివేదికలు తయారు చేయాలని అధికారులను కిచ్చెన్న కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం నాదర్ గుల్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## శివరాత్రికి పూల్ బాగ్ చమాన్ శివ హనుమాన్ ఆలయం ముస్తాబు

**ప్రతిఘటన, చాంద్రాయణగుట్ట:**




మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న పూల్ బాగ్ చమాన్ సమీపంలో ఉన్న శ్రీ శివహనుమాన్ మందిరంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సప్పిడి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అభిషేక పూజలు, స్వామివారి స్పర్శ దర్శనం, రుద్ర హోమం, ఆది దంపతులు శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ మేరకు సోమవారం ఉదయం తేదీ 16 న ఎక్క సాయి కిరణ్ గారిచే అన్నదాన కార్యక్రమం జరుగనుందని తెలిపారు. కావున భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల అభివృద్ధి ప్రధాన అజెండాగా పని చేసింది

**సామ మహేందర్ రెడ్డి**

**ప్రతిఘటన, మహేశ్వరం :**



బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల అభివృద్ధి ప్రధాన అజెండాగా పని చేసింది.. చేస్తుందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి అన్నారు. జిల్లాలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రభుత్వం లేకున్నా ప్రతిపక్షంలో బీఆర్ఎస్ పార్టీకి ఎక్కువ సంఖ్యలో ప్రజలు మద్దతు తెలిపిన సందర్భంగా మహేశ్వరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల అభివృద్ధి ప్రధాన అజెండాగా పెట్టుకుని పని చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు ఆర్థిక భరోసా, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే అభివృద్ధి పరంగా ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించిందన్నారు. రైతు బంధు, రైతు బీమా, మిషన్ భగీరథ వంటి పథకాలు లక్షలాది కుటుంబాలకు లాభం చేకూర్చాయన్నారు. ప్రస్తుతం కొన్ని రాజకీయ పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రజలు తమ తీర్పును ఎన్నోసార్లు స్పష్టంగా వెల్లడించారని తెలిపారు. విమర్శలు, ఆరోపణలు రాజకీయాల్లో సహజమే అయినా అభివృద్ధి టిఆర్ఎస్ పార్టీ ధ్యేయమన్నారు. తెలంగాణ గౌరవం, ప్రజల సంక్షేమం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు.

## పుల్వామా వీరులకు ఘన నివాళి

**ప్రతిఘటన నాగర్ కర్నూల్**



బిజినపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పుల్వామా వీరులకు బిజినపల్లి గ్రామ యువకులు క్రోవొత్తులతో ర్యాలీ నిర్వహించి, శనివారం రాత్రి పుల్వామా వీరులకు గణ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మహేష్ మాట్లాడుతూ పుల్వమా సంఘటనలో మరణించిన వీరులకు నివాళులర్పిస్తూ పుల్వమా సంఘటనకు కారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఫిబ్రవరి 14 రోజును చీకటి దినంగా ప్రకటించలన్నారు. ఈ కార్యక్రమంలో బిజినపల్లి గ్రామ ఉపసర్పంచ్ గడ్డమీద మహేష్,శివ మరియు గ్రామ యువకులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## యూనిటీ ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే




**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్**

యాదాద్రి భువనగిరి జిల్లా లోని రాయగిరి గ్రామంలోని యూనిటీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రెషర్స్ డే కార్యక్రమంలో యూనిటీ గ్రూప్ ఆఫ్ కళాశాలల చైర్మన్ ఏ. ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఏఐ టెక్నాలజీకి అనుకూలంగా నూతన విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృత కార్యక్రమాలు అందరిని ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏవో సునీత రెడ్డి, పీజీ కళాశాల హెచ్ ఓ డి సురేష్ , ఫార్మసీ కళాశాల హెచ్ ఓ డి రాజీవ్, ఇస్మాయిల్, అమర్నాథ్, నాగరాజు, అహ్మద్, మహేష్, ప్రియాంక, అమూల్య, పారిజాత, శైలజ, ఉమా, శ్వేత, కృష్ణ పాల్గొన్నారు.

## ఈనెల 16న ప్రజావాణి రద్దు : జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రతిఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్**



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున, ఈ నెల 16వ తేదీ (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## కౌన్సిలర్స్ లతో 16న ప్రమాణ స్వీకారం కలెక్టర్ హనుమంతరావు



**ప్రతిఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ లతో ప్రమాణ స్వీకారం ఈ నెల 16 న చేయించాలని నిర్ణయించినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాంబర్లో మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలలో బాగంగా ఎన్నికైన వార్డ్ కౌన్సిలర్లు కలిసి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 16 న ప్రమాణ స్వీకారం చేయనున్న వార్డు కౌన్సిలర్ల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, వార్డు కౌన్సిల్స్ మొత్తం ప్రమాణ స్వీకారం చేయాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల ప్రకారం సమయ పాలన పాటించి ఉదయం 11 గంటలకు అందరూ సభ్యులు ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ ప్రమాణ స్వీకారం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రొసీజర్ ప్రకారం నిర్వహించాలని సూచన చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. మంచి వాతావరణంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయాలని కోరారు. ఎన్నిక ఒక్కొక్క మున్సిపాలిటీకి ఒక్కొక అధికారిని నియమించడం జరిగిందని, భువనగిరి మున్సిపాలిటీ ఆర్థరైజ్డ్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి గ్రామీణ అభి వృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, పోచంపల్లి మున్సిపాలిటీ కి సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆలేరు మున్సిపాలిటీకి సంబంధించి ఆర్డిఓ కృష్ణారెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఆర్డిఓ శేఖర్ రెడ్డి, మోత్కూర్ మున్సిపాలిటీకి సంబంధించి అడిషనల్ డిఆర్డిఓ సురేష్ ను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## జీనియస్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్**



భువనగిరి పట్టణంలోని జీనియస్ పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి. సూర్యనారాయణ రెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ బి. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు మా ఉపాధ్యాయులు నూతన విద్యా విధానంతో పాఠాలు బోధిస్తున్నామని అన్నారు. అన్ని రంగాలలో విద్యార్థులు రాణించడానికి వారిని ప్రోత్సహిస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నామని అన్నారు. యూకేజీ విద్యార్థులకు ఇలాంటి గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల విద్యార్థులు తల్లిదండ్రులు ఎంతో అనుభూతిని పొందుతారని అన్నారు. చైర్మన్ పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన అన్ని వసతులతో పాటు వనరులను సమకూర్చి విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా విశాలమైన తరగతి గదులు క్రీడాస్థలాలు ఏర్పాటు చేసి విద్యార్థులను అన్ని రంగాలలో ముందు ఉంచడానికి మా యాజమాన్యం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి స్వర్ణలత, ఏవో జి. రవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
ఆదివారం 15 ఫిబ్రవరి 2026

## పల్లకీ సేవలో దర్శనమిచ్చిన స్వామివారు



**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా 7వ రోజు శనివారం ఉదయం పల్లకీ సేవలో స్వామివారు దివ్యంగా విరాజిల్లుతూ భక్తులకు దర్శనమిచ్చి కటాక్షానుగ్రహం ప్రసాదించారు. ఆలయంలో సుప్రభాత సేవతో మొదలుకొని నిత్య కైంకర్యాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

## భువనగిరి మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

**7వ వార్డు కౌన్సిలర్ కుక్కదువు పద్మ సోమయ్య**



**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణానికి చెందిన కుక్కదువ్వ సోమయ్య 1987 నుండి 2009 వరకు మూడుసార్లు కౌన్సిలర్ గా ప్రజలకు సేవలు అందించారు. భువనగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా యాదాద్రి భువనగిరి జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ క్రియాశీల రాజకీయాల్లో కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెంట ఉంటూ ఎమ్మెల్యే గత ఎన్నికల గెలుపులో కీలక పాత్ర వహించిన సోమయ్య సతీమణి కుక్కదువ్వ పద్మ సోమయ్యకు చైర్మన్ పదవి చేపట్టేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. కావున మున్సిపల్ చైర్మన్ అవకాశం ఇవ్వాలని స్థానిక ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

## శనేశ్వర స్వామికి పాక్షిక త్రయోదశి తిలతైల అభిషేక పూజలు



**ప్రతిఘటన, నాగర్ కర్నూల్**

బిజినపల్లి మండలంలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శనీశ్వర దేవాలయంలో శ్రీ విశ్వవసు సంవత్సరం మాఘమాసం కృష్ణపక్షం ద్వాదశి పాక్షిక శని త్రయోదశి శనివారం నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహ దోష నివారణకు స్వామి వారికి తిలతైలా అభిషేకలు భక్తితో వైభవంగా జరిగాయి.శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి పాక్షిక శని త్రయోదశి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయనఅన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు.అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈకార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి,శ్రీకాంత్ రెడ్డి,ఆలయ ఆర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## అమర వీర జవానులకు అశ్రు నివాళి

**ఆళ్లగడ్డ** : నేటితో జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామా ఆత్మహతి ఉగ్రదాడికి ఏడేళ్ల సందర్భాన్ని పురస్కరించుకొని 2019 ఫిబ్రవరి 14వ తేదీన సాయంత్రం మూడు గంటల 30 నిమిషాలకు జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామా జిల్లాలోని జాతీయ రహదారిపై అవంతి పొర వద్ద భద్రత దళాలపై జేసే మహమ్మద్ ఉగ్రవాది ఆత్మహతి దాడిలో అసువులు బాసిన 40 మంది సి ఆర్ పి ఎఫ్ అమర వీర జవానులకు అశ్రునివాళి అర్పిస్తూ సెల్యూట్ చేస్తూ బ్లాక్ డే కార్యక్రమాన్ని అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ ఆధ్వర్యంలో అపుస్మ ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి అమీర్ భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ టౌన్ లోని నాలుగు రోడ్ల కూడిలి వద్ద ప్రజ్ఞ హై స్కూల్ వై పి ఎం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయ బృందం మరియు ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డ టౌన్ సిఐ ఎం యుగంధర్, ఉయ్యాలవాడ ఎస్సై పి రామిరెడ్డి, రుద్రవరం ఎస్సై జయప్ప, ఆళ్లగడ్డ రూలర్ ఎస్సై వరప్రసాద్, డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి వైపిపిఎం హెచ్ఎం వీర రాఘవయ్య ప్రజ్ఞ హెచ్ఎం భాష అరుణోదయ హెచ్ఎం ఇమామ్ హుస్సేన్ ఇమ్రాన్ భాష తో కలిసి పుల్వామా ఉగ్రదాడిలో 40 మంది అమరవీర జవానుల చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులర్పించి జై జవాన్ జోహార్ జోహార్ జవాన్ భారత్ మాతాకీ వందేమాతరం జయహో భారత్ అంటూ

## ఏజెన్సీ విధానాన్ని రద్దుపరిచి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలి





**ప్రతిఘటన, నాగర్ కర్నూల్**

తెలంగాణ అవుట్సోర్సింగ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జిల్లా సమావేశాన్ని శనివారం నాడు నాగర్ కర్నూలు లో ప్రైవేట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ. సుభాష్ లు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు పరుస్తున్న ఏజెన్సీ విధానాన్ని రద్దు పరిచి, నేరుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీ.ఆర్.సీ లోని స్లాబ్ విధానాన్ని రద్దు పరచి, క్యాడర్ బేసిక్ వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రతి సంవత్సరం 10% ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పారామెడికల్ పోస్టులను భర్తీ చేస్తూ, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాంచందర్ జీ. కార్యదర్శి నిరంజన్, ఉపాధ్యక్షులు జీ.నరేష్, సందీప్, ఇస్మాయిల్ ఖాన్, రాజశేఖర్, సంపత్, బంగారి, ఆకాంశ, శశిరేఖ, నవిత, తౌఫిక్, రంజిత్ గౌడ్, రజిత, మాధవి, కృష్ణసాగర్, కర్ణ, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# బైరామల్ గూడ ఫ్లైఓవర్‌కి మహాత్మ జ్యోతిబాపూలే పేరు పెట్టాలి.

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్**

**ప్రతిఘటన, ఎల్బీనగర్ :**

బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రెడ్డి సామాజిక వర్గం కావడం మూలంగా బైరామల్ గూడ ఫ్లైఓవర్ కి దివంగత నేత వంగ మధుసూదన్ రెడ్డి పేరు పెట్టడానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి సహకరించారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్బీనగర్ ఇన్చార్జ్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. బైరమల్ గూడా ఫ్లైఓవర్ కి మహాత్మ జ్యోతిబాపూలే నామకరణం చేయాలని శనివారం ఎల్బీనగర్ లో మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిబాయ్ పూలే, సావిత్రిబాయి పూలే సంఘ సంస్కర్తలు అని తెలిపారు. ఆనాడే ఈ దేశంలో విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని చెప్పినటువంటి మహానుభావులు ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విదంగా ఎల్బీనగర్ లోని భైరమాల్ గూడ ఫ్లైఓవర్ కి మహాత్మా జ్యోతిబాపూలే పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రజా భవన్ కు మహాత్మ జ్యోతిబాపూలే పేరు పెట్టారని ఎల్బీనగర్ లో బీసీ సమాజము బలంగా ఉందని అందుకే ఇక్కడ మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహం కూడా పెట్టడం జరిగిందని తెలిపారు. కొందరు వ్యక్తుల పేర్లు పెట్టడంలో కొందరు నాయకులు ఎలాంటి త్యాగం, పోరాటం చేయకుండానే వారి వ్యక్తిగత స్వార్థం కోసం వ్యక్తుల పేర్లు ఫ్లైఓవర్లకు పెట్టాలని తహతహలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ధోరణి మంచిది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన




సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్, హైదరాబాద్ ఇన్చార్జ్ బావన, మేడ్చెల్ మల్కాగజ్ గిరి యువజన సంఘం అధ్యక్షులు రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పాకాల నరసింహా, సింగం అరుణ్, ఎన్టీఆర్ నగర్ డివిజన్ అధ్యక్షులు సంపత్ ప్రసాద్, కొత్తపేట డివిజన్ అధ్యక్షులు స్వామి ముదిరాజ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు అందక మనోవేదనతో ఉద్యోగి మృతి

**హయత్ నగర్ నార్మల్ మదర్ డైయిరీలో తీవ్ర ఉద్రిక్తత.. మృతదేహంతో ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు**

**ఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్**



ప్రతిఘటన, ఎల్బీనగర్: జీతాలందకా ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఉద్యోగి విధుల్లో ఉండగానే కుప్పకూలిపోయాడు. అతడిని తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన హయత్ నగర్ లోని నల్లగొండ -రంగారెడ్డి పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్మల్-మదర్ డైయిరీ) లో చోటు చేసుకుంది. నార్మల్ మదర్ డైయిరీ లో తులసి గారి బాలనర్సింహా (46) ప్లాంట్ ఆపరేటర్ విభాగంలో ఫ్రీ ప్యాక్ సెక్షన్ సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం డ్యూటీలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అతడిని తోటి ఉద్యోగులు స్థానికంగా ఉండే ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుండి మలక్ పేట్ యశోద హాస్పిటల్లో చేర్పించారు. అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ కావడంతో వైద్యానికి లక్షల్లో ఖర్చు అవుతుందని కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాల నర్సింహా శనివారం ఉదయం మృతి చెందాడు. గత నాలుగు నెలలుగా నార్మల్ మదర్ డైరీ యాజమాన్యం జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో బ్రెయిన్ స్ట్రోక్ గురై బాల నర్సింహా మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. గాంధీ ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని హయత్ నగర్ లోని నార్మల్ మదర్ డైయిరీ వద్దకు తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. బాలనర్సింహా మృతికి నార్మల్ డైయిరీ యాజమాన్యమే కారణమని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. డైరీ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించిన కుటుంబ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.


### బాధితులకు అండగా చెన్నగౌని శ్రీధర్ గౌడ్



నార్మల్ మదర్ డైయిరీ ఘటన తెలిసిన వెంటనే హయత్నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి నార్మల్ మదర్ డైరీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నార్మల్ మదర్ డైయిరీ చైర్మన్ తో ఫోన్లో మాట్లాడి వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. మృతుడు బాల నర్సింహా కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ బాధితుల అండగా పోరాడుతుందని హెచ్చరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన నార్మల్ -మదర్ డైయిరీ చైర్మన్ రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకొని బాల నర్సింహా కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# బిజినెస్

## టీసీఎస్‌ను వెనక్కి నెట్టిన ఐసీఐసీఐ బ్యాంక్




దేశీయ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్‌కు వరుస దెబ్బలు తగులుతున్నాయి. మార్కెట్ విలువ పరంగా దేశంలో అత్యంత విలువైన సంస్థల జాబితాలో టీఎస్‌ను ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ అధిగమించిన ఒకరోజులోనే మరో స్థానం కోల్పోయింది. గురువారం ప్రైవేట్ రంగ అతిపెద్ద ఐసీఐసీఐ బ్యాంక్ టీసీఎస్‌ను దాటి ఐదో స్థానం దక్కించుకుంది. దీంతో టీసీఎస్ ఆరో స్థానానికి పడిపోయింది. బ్లూమ్‌బెర్గ్ డేటా ప్రకారం, 2009, జూన్ తర్వాత మొదటిసారిగా ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్‌లో టీసీఎస్‌ను అధిగమించింది. సాయంత్రం స్టాక్ మార్కెట్లు ముగిసే సమయానికి ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ. 10.21 లక్షల కోట్లు ఉండగా, టీసీఎస్ విలువ రూ. 9.96 లక్షల కోట్లకు చేరింది. గురువారం ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ ధర దాదాపు 22 శాతం పెరిగి రూ. 1,432కి చేరింది. ఇదే సమయంలో టీసీఎస్ షేర్ సుమారు 6 శాతం క్షీణించి రూ. 2,741.90 వద్ద ముగిసింది. ఇది 2020, డిసెంబర్ తర్వాత అత్యల్ప స్థాయి. బీఎస్‌ఈ డేటా ప్రకారం, ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ. 19.71 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో అత్యంత విలువైన సంస్థగా ఉంది. దీని తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(రూ. 14.19 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్(రూ. 11.51 లక్షల కోట్లు)తో తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

## రిలయన్స్ చేతికి వెనెజువెలా చమురు!




వెనెజువెలా నుంచి ముడిచ మురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతిపెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్‌ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లు బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడిచమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్‌ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 2019–20లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్‌ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం.

## ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 85 శాతం బోనస్

# ఫిబ్రవరి నెల జీతంతో పాటుగా..




భారత ఐటీ రంగం దిగ్గజం ఎనిటనీబఎబ ఉద్యోగులకు గుడ్ న్యూస్ అందించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలోని మూడో త్రైమాసికానికి (క్యూ3) సంబంధించి ఉద్యోగులకు చెల్లించే పనితీరు ఆధారిత బోనస్‌ను సగటుగా 85 శాతంగా ప్రకటించింది.ఇది ఇటీవల త్రైమాసికాలతో పోలిస్తే అత్యధిక బోనస్‌గా నిలవడం గమనార్హంగా చెప్పుకోవచ్చు. ఈ బోనస్ మొత్తం ఉద్యోగులకు ఫిబ్రవరి నెల జీతంతో పాటు చెల్లించనున్నట్లు సంస్థ అంతర్గత సమాచారంలో పేర్కొంది. ఇటీవల కాలంలో ఐటీ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొం టున్నప్పటికీ.. ఎనిటనీబఎబ మాత్రం వ్యాపార పరంగా స్థిరమైన ప్రదర్శన చూపింది. ముఖ్యంగా కొత్త ఒప్పందాలు దక్కించుకోవడం, ప్రాజెక్టుల అమలు మెరుగ్గా సాగడం వంటివి ఈ బోనస్ పెంపుకు ప్రధాన కారణాలుగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బోనస్ శాతం పెరగడం వల్ల ఉద్యోగుల మనోధైర్యం గణనీయంగా పెరిగిందని.. మార్కెట్‌లో టెక్నాలజీ షేర్లపై ఒత్తిడి ఉన్నా ఉద్యోగుల్లో మాత్రం సానుకూల భావన కనిపిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ త్రైమాసికంలో ఉద్యోగుల వ్యక్తిగత పనితీరు ఆధారంగా బోనస్ శాతాలు మారాయి. కొంతమంది ఉద్యోగులు 75 శాతం నుంచి 100 శాతం వరకు బోనస్ పొందినట్లు తెలిపారు. గత త్రైమాసికంతో పోలిస్తే సుమారు 10 నుంచి 15 శాతం వరకు ఎక్కువ బోనస్ దక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. అత్యుత్తమ పనితీరు కనబరిచిన కొందరికి పూర్తిస్థాయి. అంటే 100 శాతం బోనస్ లభించడం విశేషం. గత కొన్ని త్రైమాసికాల్లో ఇంత అధిక స్థాయిలో బోనస్ ఇవ్వడం అరుదైన విషయమని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎనిటనీబఎబలో సుమారు 3.2 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ బోనస్ నిర్ణయం ఇటీవల విడుదలైన ఉద్యోగుల పనితీరు రేటింగ్స్ తర్వాత రావడం గమనించదగ్గ అంశం. గత సంవత్సరం కూడా పనితీరు ఆధారంగా సంస్థ 5 శాతం నుంచి 8 శాతం వరకు జీత పెంపు ఇచ్చిన సంగతి ఉద్యోగుల్లో ఆశలు పెంచుతోంది. ఈసారి బోనస్ పెరగడానికి ప్రధాన కారణం కంపెనీ ఆర్థిక పనితీరు మెరుగ్గా ఉండటమే. ఆదాయ వృద్ధి అంచనాల్లో స్థిరత్వం, లాభాల్లో మెరుగుదల, అలాగే కీలక మార్కెట్ల నుంచి వచ్చిన ఆర్డర్లు సంస్థకు బలాన్నిచ్చాయి. జనవరిలో ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ మేనేజ్‌మెంట్ కూడా భవిష్యత్తుపై సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ఇచ్చిన అధిక బోనస్ సంస్థ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. బోనస్ పెరగడంతో పాటు, ఇప్పుడు ఉద్యోగులు తదుపరి దశగా జీతం పెంపు (పే రైజ్)పై ఆశలు పెట్టుకున్నారు. కంపెనీ మానవ వనరుల విభాగం గతంలో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశాల్లో కూడా వేరియబుల్ పే మెరుగ్గా ఉంటుందన్న సంకేతాలు ఇచ్చింది.

## ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి అడుగు పెట్టిన ఫ్లిప్‌కార్ట్!




ఈ కామర్స్ విభాగంలో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చి ముందంజలో ఉన్న ఫ్లిప్‌కార్ట్.. ఇప్పుడు ఫుడ్ డెలివరీ రంగంలో కూడా అడుగుపెట్టనుంది. అయితే, కంపెనీ నిజానికి ఎప్పుడు ఈ సేవను ప్రారంభించనుందో, జొమాటో ఄ స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ లీడర్లకు గట్టి పోటీ ఇచ్చగలదా అనే విషయాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.వార్తల ప్రకారం, ఫ్లిప్‌కార్ట్ 2026 మే–జూన్ నాటికి బెంగళూరులో ప్రయోగా త్మకంగా ఫుడ్ డెలివరీ ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తరువాత, 2026 చివరి లేదా 2027 ప్రారంభంలో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ఈ సర్వీస్ అందుబాటులోకి రానుందని అంచనా.వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీలోకి అడుగుపెట్టిన తర్వాత, జొమాటో ఄ స్విగ్గీ వంటి లీడర్లకు గట్టి పోటీగా మారే అవకాశం ఉంది. కంపెనీ మార్కెట్ విలువ 2025 ఆర్థిక సంవత్సరానికి 9 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2030 నాటికి 25 బిలియన్ డాలర్ల వరకు చేరుతుందని అంచనా.ఫుడ్ డెలివరీ కోసం ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే ప్రత్యేక టీమ్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గమనించదగ్గ విషయం ఏమిటంటే, రెండేళ్ల క్రితం ఫ్లిప్‌కార్ట్ ఓలా, పేటీఎం వంటి సంస్థలతో కలిసి ాఔఆఅ ద్వారా ఫుడ్ డెలివరీ రంగంలోకి రావాలని యోచించినప్పటికీ, ఆ చర్చలు ముందుకు వెళ్లలేదు. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ మళ్లీ తెరమీదకు వచ్చింది, కానీ ఫ్లిప్‌కార్ట్ నుండి ఇంకా అధికారిక ప్రకటనలేదు.ప్రస్తుతం ఫుడ్ డెలివరీ కోసం మార్కెట్లో పలు ప్లేయర్లు ఉన్నా, జొమాటో ఄ స్విగ్గీ మాదిరిగానే సక్సెస్ సాధించలేకపోయారు. ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ ప్రవేశించడం వల్ల ఫుడ్ డెలివరీ విభాగంలో ఎంత వరకు విజయం సాధించగలదో త్వరలోనే తెలుస్తుంది. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీ వార్తలు బయటి వినిపించగానే, జొమాటో, స్విగ్గీ షేర్లలో కొద్దిగా తగ్గుదల కనిపించింది.

# పాక్‌తో మ్యాచ్..

# అర్ష్‌దీప్ సింగ్ కంటే అతడే బెటర్






టీ20 ప్రపంచకప్–2026లో హైవోల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఆదివారం (ఫిబ్రవరి 15) కొలంబో వేదికగా భారత్–పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి దాయాది జట్టుకు మరోసారి ఓటమి రుచిని చూపించాలని భారత్ పట్టుదలతో ఉంది. అయితే పాక్ జట్టులో అద్భుతమైన స్పిన్నర్లు ఉండడంతో భారత్‌కు జట్టుకు గట్టి పోటీ ఎదురు కానుంది అని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత టీమ్ మెనెజ్‌మెంట్‌కు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కీలక సూచన చేశాడు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. కాగా గురువారం(ఫిబ్రవరి 12) నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 93 పరుగుల తేడాతో భారీ విజయం సాధించినప్పటికీ, అర్ష్‌దీప్ సింగ్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. “నమీబియాతో మ్యాచ్‌లో భారత బౌలర్లందరూ వికెట్లు తీశారు. అర్ష్‌దీప్ ఓ వికెట్ పడగొట్టినప్పటికి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. అతడితో మూడు ఓవర్లు మాత్రమే కెప్టెన్ బౌలింగ్ చేయించాడు. శివమ్ దూబె సైతం రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. హార్దిక్ పాండ్యా కూడా తన నాలుగు ఓవర్ల కోటాను పూర్తి చేశాడు. సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్‌ను రొటేట్ చేసిన విధానం చూస్తుంటే పాక్ మ్యాచ్ కోసం ఒక ప్రణాళికతో ఉన్నట్లు కన్పిస్తోంది. పాక్‌తో మ్యాచ్‌కు అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశముంది. అందుకేనేమో నమీబియాతో మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌కు బదులుగా పాండ్యాతో మొదటి ఓవర్‌ను బౌలింగ్ వేయించాడు. అదేవిధంగా శ్రీలంక పిచ్‌లు స్పిన్‌కు ఎక్కువగా అనుకూలిస్తాయి. భారత్ గతంలోనూ ఇక్కడ ముగ్గురు స్పిన్నర్లతో ఆడింది. కాబట్టి కుల్దీప్‌ను జట్టులోకి తీసుకోవడం మేలు“ అని గవాస్కర్ ‘స్టార్ స్పోర్ట్స్‘ డిబేట్‌లో పేర్కొన్నాడు.

## క్రికెట్‌కు బ్రేక్.. పదో తరగతి పరీక్షలు రాయనున్న వైభవ్ సూర్యవంశీ



నిన్నటివరకు మైదానంలో బౌలర్లను బెంబేలెత్తించిన భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు క్లాస్‌రూమ్‌లో కూర్చుని పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యాడు. ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభం కానున్న సీబీఎస్‌ఈ పదో తరగతి బోర్డు పరీక్షలకు అతడు హాజరు కానున్నాడు. బిహార్‌లోని సమస్తిపూర్‌లోని పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వైభవ్ ఈ పరీక్షలు రాయనున్నాడు. వైభవ్ సూర్యవంశీ మా పాఠశాలలో 10వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరు కానున్నాడు. అతడికి ఇప్పటికే అడ్మిట్ కార్డ్ అందించాము. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వైభవ్ రాక కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అతడు ఇంకా విద్యార్థి కాబట్టి ఎటువంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం లేదు. అందరితో కలిసే పరీక్షలు రాయనున్నాడు. అందుకు తగ్గట్టు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పోదార్ స్కూల్ ప్రిన్సిపాల్ నీల్ కిషోర్ సిన్హా పేర్కొన్నారు. కాగా 14 ఏళ్ల వైభవ్ ఐపీఎల్–2025లో రాజస్తాన్ తరపున కేవలం 15 బంతుల్లో సెంచరీ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత కూడా భారత్–ఎ జట్టు, అండర్–19 జట్టు తరపున సంచలన ప్రదర్శనలు చేశాడు. ఇటీవల జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో సైతం దుమ్ములేపాడు. ఇంగ్లండ్‌తో జరిగిన అండర్–19 ప్రపంచకప్ ఫైనల్‌లో 175 పరుగులతో సత్తాచాటిన వైభవ్.. భారత్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. మొత్తంగా 439 పరుగులు చేసిన వైభవ్ ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‘ గా నిలిచాడు.

# స్పోర్ట్స్

## ఒమన్‌ను చిత్తు చేసిన ఐర్లాండ్.. సెమీస్ ఆశలు సజీవం





టీ20 ప్రపంచకప్–2026లో ఐర్లాండ్ బోణీ కొట్టింది. శనివారం కొలంబో వేదికగా జరిగిన గ్రూప్–బి మ్యాచ్‌లో ఒమన్‌పై 96 పరుగుల భారీ తేడాతో ఐర్లాండ్ ఘన విజయం సాధించింది. దీంతో ఐరిష్ జట్టు తమ ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాపార్డర్ విఫలమైనప్పటికి మిడిలార్డర్ బ్యాటర్లు లోర్కాన్ టక్కర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ముఖ్యంగా టక్కర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. టక్కర్ కేవలం 51 బంతుల్లో 94 పరుగులు (10 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి నాటౌట్‌గా నిలిచాడు. డెలానీ 30 బంతుల్లో 56 పరుగులతో మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. జార్జ్ డాక్రెల్ కేవలం 9 బంతుల్లోనే 5 సిక్సర్ల సాయంతో 35 పరుగులు చేశాడు. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ మూడు, కలీం రెండు వికెట్లు సాధించారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్.. ఐర్లాండ్ బౌలర్ల ధాటికి 18 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. ఒమన్ బ్యాటర్లలో అమిర్ కలీం (50),హమ్మద్ మీర్జా (46) రాణించగా.. మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జాషువా లిటిల్ 3 వికెట్లు పడగొట్టగా.. బారీ మెక్‌కార్తీ, మాథ్యూ హంఫ్రీస్ చెరో రెండు వికెట్లు తీశారు.



# విశ్వక్ సేన్ 'ఫంకీ'కి డీసెంట్ స్టార్ట్.. వాలెంటైన్స్ వీక్ ఎఫెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా, 'జాతిరత్నాలు' ఫేమ్ దర్శకుడు అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వచ్చిన అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ ఫంకీ బాక్సాఫీస్ వద్ద డీసెంట్ ఓపెనింగ్స్ నమోదు చేసింది. ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 2.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. వాలెంటైన్స్ వీక్ కావడంతో ముఖ్యంగా యూత్ ఆడియన్స్ థియేటర్లకు ఆకర్షితులవుతున్నట్టు కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా నైజాం ఏరియాలో సుమారు రూ. 1.25 కోట్లు గ్రాస్ వచ్చినట్లు సమాచారం.
ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 1 కోటి వరకు వసూళ్లు నమోదయ్యాయి. ఇక ఇతర రాష్ట్రాలు, ఓవర్సీస్ కలుపుకుని మరో రూ. 25 లక్షల వరకు గ్రాస్ వచ్చినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. అనుదీప్ కేవీ స్టైల్ కామెడీ టైమింగ్, విశ్వక్ సేన్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సుమారు రూ. 15 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే వచ్చే రోజుల్లో నిలకడైన కలెక్షన్లు అత్యవసరం. అయితే నేడు వాలెంటైన్స్ డే, రేపు ఆదివారం సెలవు దినం కావడంతో వీకెండ్‌లో వసూళ్లు పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. యంగ్ ఆడియన్స్ నుండి మంచి టాక్ రావడం కూడా సినిమాకు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కయాదు లోహర్ నటించగా, సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించారు. ఇప్పటికే పాటలు సోషల్ మీడియాలో చార్ట్‌బస్టర్లుగా మారి సినిమాకు మంచి బజ్ తీసుకొచ్చాయి. మొత్తానికి కామెడీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికగా వచ్చిన 'ఫంకీ'కి మొదటి రోజు డీసెంట్ స్టార్ట్ లభించడం చిత్రబృందానికి ఊరటనిచ్చింది. వీకెండ్ కలెక్షన్లు ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.




## 'బ్యాండ్ మేళం' వాలెంటైన్స్ గ్లింప్స్ వైరల్.. రోషన్‌శ్రీదేవి ఎమోషనల్ లవ్ స్టోరీపై పెరిగిన అంచనాలు

టాలీవుడ్ యంగ్ పెయిర్ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటిస్తున్న లేటెస్ట్ లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ బ్యాండ్ మేళం పై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. కొత్త దర్శకుడు సతీష్ జవ్వాజి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. కోన ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య, శ్రావ్యలు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం యువ ప్రేక్షకుల్లో మంచి బజ్ సొంతం చేసుకుంది. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రబృందం 'బ్యాండ్ మేళం' స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో హీరో తన ప్రేమను వ్యక్తపరుస్తూ చెప్పిన ఎమోషనల్ డైలాగ్స్ ప్రేక్షకులను హత్తుకునేలా ఉన్నాయి. రొమాంటిక్ టోన్‌తో పాటు భావోద్వేగ సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ గ్లింప్స్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం విశేషం. 'బ్యాండ్ మేళం' పూర్తి స్థాయి ప్రేమకథగా ఉండబోతున్నప్పటికీ, ఇందులో కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేసినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. యువతను ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు హృదయాన్ని తాకే ఎమోషనల్ కంటెంట్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇంతకుముందు 'కోర్ట్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రోషన్‌శ్రీదేవి జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడం ఈ ప్రాజెక్ట్‌కు ప్లస్ పాయింట్‌గా మారింది.

# రాజాసాబ్‌లో డూప్ అంటూ ట్రోలింగ్.. స్పందించిన హీరోయిన్



ప్రభాస్- మారుతి కాంబినేషన్‌లో 'ది రాజాసాబ్' సినిమా ప్రకటించినప్పటి నుంచి విమర్శలు వెంటాడుతూనే ఉన్నాయి. తీరా సినిమా రిలీజయ్యాక కూడా ట్రోలింగ్స్ మరింత పెరిగాయే తప్ప ఆగలేవు. ముఖ్యంగా ప్రభాస్‌కు చాలాచోట్ల డూప్ ఉపయోగించడంపై విపరీతమైన విమర్శలు వచ్చాయి. ఓ ఫైట్ సీన్ కోసం హీరోయిన్ మాళవిక మోహనన్‌కు కూడా డూప్ ఉపయోగించడంతో తనను కూడా ట్రోల్ చేశారు.
ట్రోలింగ్‌పై స్పందించిన హీరోయిన్ తాజాగా ఈ వివాదంపై మాళవిక మోహనన్ స్పందించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ట్వీట్ చేసింది. ది రాజాసాబ్ సినిమాలో నేనే స్వతాహాగా స్టంట్స్ చేశానని చెప్పుకున్నాను. అయితే నా బాడీ డబుల్ (డూప్) యాక్షన్ సీన్‌లో ఉన్నట్లుగా ఓ ఫోటో వైరలవుతోంది. ఆ ఫోటోలో ఉన్న వ్యక్తి స్టంట్ ఆర్టిస్ట్.. అలాగే నా డూప్ కూడా!

### చిన్నతనం నుంచే..

ముందుగా నేను చెప్పొచ్చేదేంటంటే.. నాకు యాక్షన్ అంటే ఇష్టం. ఫైట్ సన్నివేశాల్లో పాల్గొనడాన్ని ఆస్వాదిస్తాను. చిన్నతనం నుంచే నేను స్పోర్టివ్ అమ్మాయిని. కొత్త విషయాలు నేర్చుకోవడం, శరీరాన్ని ఛాలెంజ్ చేయడం అంటే చాలా ఇష్టం. రెండో విషయం.. సెట్‌లో ఎప్పుడూ స్టంట్ డబుల్స్ సిద్ధంగా ఉంటారు. నటీనటులు సొంతంగా యాక్షన్ సీన్స్ చేసినా సరే వారు అందుబాటులోనే ఉంటారు.

### రిస్కీ షాట్స్ మాత్రం..

వారు అనుభవజ్ఞులు కాబట్టి.. యాక్షన్ డైరెక్టర్ వారిని ఫైట్ రిహార్సల్స్ చేయమని చెప్తాడు. ఫైనల్ షాట్ మాత్రం మాపై చిత్రీకరిస్తారు. అయితే కొన్ని సన్నివేశాలు చాలా ప్రమాదకరం అని భావించినప్పుడు నటులకు బదులుగా స్టంట్ డబుల్‌ను సీన్ పూర్తిచేయమని అడుగుతారు. ఎందుకంటే ప్రొఫెషనల్స్ అయితే ఏ సమస్యా లేకుండా వాటిని ఈజీగా చేయగలరు.

### వివరణ అక్కర్లేదు

ఫైనల్‌గా.. నేను ఫైట్ సీన్స్ సమర్థవంతంగా చేసేందుకు నా స్టంట్ డబుల్ ఎంతగానో తోడ్పడింది అంటూ వీడియోలు షేర్ చేసింది. ఒక్క ట్వీట్ ద్వారా యాక్షన్ సీన్స్ తానే చేసినట్లు క్లారిటీ ఇచ్చింది. ఇది చూసిన అభిమానులు నువ్వు టాలెంటెడ్ అని మాకు తెలుసు.. నువ్వు ఎలాంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు అంటున్నారు. ప్రస్తుతం రాజాసాబ్ హాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది.



# 'విశ్వనాథన్ అండ్ సన్స్'గా సూర్య వైరల్ అవుతున్న టైటిల్!

తమిళ అగ్ర దర్శకుడు సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. చూబతీఅఖ్మి46 గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకోగా.. కేవలం ఐదు రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉండటంతో నిర్మాతలు పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించారు. ఈ చిత్రం విడుదల తేదీపై నిర్మాత నాగవంశీ క్లారిటీ ఇస్తూ.. సూర్య నటిస్తున్న మరో చిత్రం 'కరుప్పు' విడుదలైన మూడు నాలుగు నెలల తర్వాతే ఈ సినిమా థియేటర్లలోకి వస్తుందని స్పష్టం చేశారు. 'కరుప్పు' చిత్రం ఏప్రిల్ 2026లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండటంతో, వెంకీ అట్లూరి దర్శకత్వంలోని ఈ మూవీ జూలై లేదా ఆగస్టు 2026లో విడుదల కానుంది. సూర్య కెరీర్‌లో విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ధనుష్‌తో పెళ్లి పుకార్లపై మృణాల్ ఠాకూర్ ఫుల్ క్లారిటీ.. ఏప్రిల్ 1న చేసుకుంటా అంటూ సెటైర్



సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో "మేము కేవలం మంచి స్నేహితులమే" అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు.ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను యాంకర్ నేరుగా ఈ విషయంపై ప్రశ్నించాడు. "ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?" అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. "ఫిబ్రవరి 14 కాదుడ ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!" అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, "ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది" అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.గతంలో ఈ డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఒక పోస్ట్ పెట్టి "విని నవ్వుకుంటాం" అని రాసింది. అయితే ఇప్పుడు మొదటిసారి ఓ ఇంటర్వ్యూలో డైరెక్ట్‌గా స్పందించి పూర్తి క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం వీరిద్దరి మధ్య ఎలాంటి రిలేషన్ లేదని, కేవలం స్నేహం మాత్రమేనని మరోసారి స్పష్టమైంది.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.